
ఆంధ్ర సచిత్ర వారపత్రిక



8-12-78

75 పైసలు



మీరు ఎన్ని భాషలు చదవగలరు?
ఒకటి, రెండు, మూడు... అంతేనా! అలా ఆగిపోనవసరం లేదు. 'విపుల' మీచేత ఎన్నెన్నో భాషల కథలను నెల నెలా ఆసక్తితో చదివింపజేస్తుంది...
అనేక భాషల అత్యుత్తమ కథల వేదిక విపుల.
తెలుగు
ఇటాలియన్
హిందీ
ఫ్రెంచి
సింధీ
బెంగాలీ
ఇంగ్లీష్
తమిళం
ఉర్దూ
విపుల
రంగుల ఆఫ్‌సెట్ ముద్రణ. కథలకుతోడు కార్టూన్లు, జోకులు * 132 పేజీలు 125 పైసలు మాత్రమే.

ఆంధ్రసచిత్రవారపత్రిక

వ్యవస్థాపకులు:
దేశోద్ధారక కాశీనాథుని
నాగేశ్వరరావు పంతులుగారు
స్థాపితం : 1908
శివలెంక శంభుప్రసాద్
సంపాదకుడు :
[1938—1972]
శుక్రవారం : 8-12-'78
కాళయుక్తినామ సం. మార్గశిర శు. నవమి
సంపుటము 72 : సంచిక 13

సంపాదకుడు :
శివలెంక రాధాకృష్ణ

*

పోస్టులో ఏడాది చందా రు. 41-60
ఆరు మాసాల చందా రు. 20-80
విడి ప్రతి వెల 75 పైసలు


ఆంధ్రపత్రిక కార్యాలయము
గాంధీనగరం, విజయవాడ-520 003

విషయానుక్రమణిక



Nestlé
నవరక్తిని, నవశక్తిని కలిగించే
నెస్‌కాఫే
NESCAFE
నూటికి నూరుపాళ్ళు స్వచ్ఛమైన కాఫీతో
తయారయ్యే ఒకే ఒక ఇన్‌స్టెంట్ కాఫీ





పద్నాలుగేళ్ళ కరుణ బెడ్ రూమ్‌లో మంచంమీద కూర్చుంది. కిటికీలోంచి బయటికి చూసింది. దూరాన వైష్ణవదేవి కొండలు మంచుతో కప్పబడిపోయి అప్పుడే మెరుగు పెట్టిన వెండిలా మెరుస్తున్నాయి.

ఆకాశంలో మేఘాలున్నంతమేరా తూర్పు నుంచి బయలుదేరుతున్న సూర్యుడి కిరణాలు పడి తెల్లగా ధగధగ లాడుతున్నాయి. మధ్య మధ్య నీలాకాశం ప్రశాంతంగా కని పిస్తోంది.

కరుణ వయసు చిన్నదే. కాని ఆ పిల్ల చాలా నవలలు— ఇంగ్లీషు, తెలుగు, హిందీ భాషల్లోవి చదివింది. కిటికీలోంచి ఆ వయసు పిల్లలు చూస్తే ఆకాశాన్ని ఎగిరే పక్షుల్ని చూసి వుండేవాళ్ళు. కాని కరుణలో మారుమూల ఓ రచయితా, ఓ చిత్రకారుడూ దోబూచులాడుతున్నారు. ఆ పిల్ల ప్రకృతి వింత శోభని కళ్ళు వెడల్పు చేసుకుని మరీ చూస్తోంది.

పన్నెండు గంటలు దాటిపోయింది. మధ్యాహ్నం అయినా "క్విల్ట్"లో దూరి వెచ్చగా పడుకోవాలనిపిస్తోంది. ఆగష్టు నెలే అయినా చలి వడవడా వణికించేస్తోంది. "బెడ్"మీద పడుకుని 'గరమ్ గరమ్ చాయ్' ఎన్నిసార్లు తాగినా కాలు మాత్రం క్రింద పెట్టాలనిపించడంలేదు.

'ఆయా' కరుణ కేకేసింది.

'హాజీ' సమాధానంగా ఆయా దర్శన్ వచ్చింది.

కరుణ హిందీలో అడిగింది: 'మమ్మీ డాడీ లేవారా?'

'లేదు.'

'పోనీ బెడ్ టీ తీసుకున్నారా?'

'అమ్మగారు తీసుకు వెళ్ళారు రెండు కప్పులో.'

'వంట చేయమని చెప్పిందా నీకు?'

గూర్ఖాస్ కరుణ

సీరియల్ ప్రారంభం

గంటి వెంకటరమణ

'అవునండి. రొట్టె వేసి ఆలూ రసాధార్ చేశామన్నారు.'

'దర్శన్'

దర్శన్ కళ్ళు పైకెత్తి చూసింది.

'ఇవాళ నాకు కొంచెం అన్నం వండి పెట్టు.'

'అలాగేనమ్మా' దర్శన్ వెళ్ళిపోయింది.

కరుణకి మంచం దిగి వెళ్ళి దర్శన్‌ని కౌగిలించుకుని వీపుమీద గుద్దాలని వుంది. కానీ చలి భరించలేక పోతోంది. అందుకే 'క్విల్ట్' వొంటినిండా కప్పుకుంది.

దర్శన్ డాక్టర్ వసిష్ఠ భార్గవ్ యింటికి ఎప్పుడు వచ్చిందో తెలియదు కానీ కరుణ పుట్టడం డాక్టర్ భార్య మేనక చావు బతుకుల మధ్య పోరాడడం అన్నీ మొన్న మొన్న జరిగినట్టున్నాయి. వసిష్ఠ భార్గవ్ హస్తవాసి మంచిదని అందరూ తెగ మెచ్చుకుంటారు. మేనక కూడా డాక్టర్ కావడం వల్ల రెండు చేతులా సంపాదిస్తున్నారు భార్యాభర్తలు యిద్దరూ. డబ్బు రావడం ఎలా వస్తోందో వెళ్ళడం కూడా అంతే వేగంగా జరుగుతూ వుంటుంది అయింట్లో.

మేనక అందం మాటల్లో చెప్పేందుకు చాలనిది. భార్గవ్ ఆమెను ఎఫ్. ఆర్. సి. యస్ చదివేందుకు వెళ్ళేముందు ప్రేమించి పెళ్ళి చేసుకున్నాడు.

మేనక స్వగ్రామం చీరాల అయితే భార్గవది కాకినాడ. యిద్దరూ బొంబాయి మెడికల్ కాలేజీలో చదివారు. చదువు పూర్తయాక ఆర్మీ డాక్టర్‌గా చాలా వూళ్ళు

గవర్నెస్ కరుణ

తిరిగి పదిహేనేళ్ళ క్రితం జమ్మూలో స్థిరపడ్డారు యిద్దరూ.

అక్కడ స్థలం కొని యిల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం అనుమతించదు కనుక ఆర్మీలోంచి డిస్చార్జ్ అయాక అలవాటు పడిన వాతావరణం కనుక గోల్ మార్కెట్ దగ్గర క్లినిక్ పెట్టాడు డాక్టర్ భార్గవ. మేనక గవర్నమెంట్ హాస్పిటల్‌లో పని చేస్తోంది.

'దర్శన్'...కరుణ పిలుపు విని మళ్ళీ వచ్చింది దర్శన్.

'ఏంకావాలమ్మా ?'

'చాయ్ !'

'ఇన్నిసార్లు చాయ్ తాగుతే ఆరోగ్యం పాడైపోతుంది. నేను పెట్టివ్వను' దర్శన్ ఖచ్చితంగా అంది. కరుణ బిక్క మొహం వేసింది. దర్శన్ ఆ పిల్ల మంచం దగ్గరకి వచ్చి రెండు చేతులూ చాపింది. కరుణ చిన్నగా నవ్వి 'చలి. నేను రాలేను' అంది.

ఐదునిమిషాల్లో హీటర్ మీద టీ తయారుచేసి తీసుకువచ్చి యిచ్చింది దర్శన్. టీ తాగుతూ 'దర్శన్ నువ్వెళ్ళిపోతే నన్ను ఎవరు చూస్తారు ?' అని అడిగింది కరుణ.

దర్శన్ వెంటనే జవాబు చెప్పలేక పోయింది. 'చెప్పు దర్శన్ - నువ్వు లేకపోతే నేను చచ్చిపోతాను.'


ఈ మాట పూర్తికాకుండానే 'ఒద్దు... ఒద్దమ్మా... నే నెక్కడికీ పోతాను తల్లీ విస్సు వదిలి' అంది. దర్శన్ కళ్ళు నీళ్ళతో తడిసాయి

కరుణ టీ త్రాగడం పూర్తిచేసి కప్పు అందించి ముసుగుతన్ని పడుకుంది.

* * *

శీతాకాలంలో జమ్మూలో అప్పుడప్పుడు ...అప్పుడప్పుడేమిటి తరుచు ఒళ్ళు వగులుతూంటుంది. వర్షం పడినప్పుడు రిలీఫ్‌గా వుంటుంది. ఒళ్ళు జాగ్రత్తగా వుండేందుకు అక్కడి వాళ్ళందరూ వర్షం ఎప్పుడు పడుతుందా అని ఎదురు చూస్తూ వుంటారు. ఒక్కోరోజు ప్రొద్దున్నే ప్రారంభించిన చినుకులు రెండు రోజులైనా తెరిపినివ్వదు సూర్యుడు అసలు ఎక్కడ వున్నాడో - డా అంతు చిక్కదు. మబ్బులు కమ్మిన ఆకాశం అసుర సంధ్యలా వుంటుంది. రోజంతా పగలేదో చీకటేదో తెలియని అవస్థలో గడిపేస్తారు. వర్షం పడగానే ఆ చలికి దుప్పట్లోంచి బయటికి కాలు పెట్టాలంటే ప్రాణం పోయినంతపని అవుతుంది. రెండు రోజుల్నుంచి స్కూలు మానేసింది కరుణ. అదేం అని అడిగేవాళ్ళు లేరు ఆ యింట్లో. తల్లీ, తండ్రీ హైసొసైటీ పేరుతో రాత్రి రెండు గంటల వరకూ డ్రింక్స్ పార్టీలో మునిగి తేలి చివరికి మునిగిపోయి యిప్పుడు నాలుగంటలు దాటుతున్నా లేవలేదు.

లేచినా తిరిగి నాలుగు కార్లూ, రెండు స్కూటర్లూ వచ్చి ఆ బంగ్లా ముందు ఆగుతాయి. చల్లని వాతావరణానికి గొంతులోకి హాట్ డ్రింక్స్ పంపగానే ఎక్కడలేని ఉత్సాహంతో యిల్లు కోలాహలం అయిపోతుంది. కరుణకి ఆ వచ్చే వాళ్ళంటే అసలు గిట్టదు. ఎంతసేపూ స్టీరియోలో వెస్ట్రన్ మ్యూజిక్ వింటూ ఆ గ్లాసులు పట్టుకుని పెద్ద నాట్యం వచ్చిన వాళ్ళల్లా అడుగులు వేస్తూ లోకాన్నే మరిచి పోతూ వుంటారు. చంద్రభాను కొడుకూ, మిత్రా కొడుకూ వచ్చినప్పుడు మేడమీద వున్న ఈ గదిలో కారమ్స్ ఆడుతూంటారు వాళ్ళు రానప్పుడు పరమ బోర్. క్రిందికి వెడుతూంటే వెంటిలేటర్‌లోంచి స్పష్టంగా కనిపిస్తుంది అక్కడ తాగేసిన ఆడవాళ్ళూ మగవాళ్ళూ నడుమూ నడుమూ తగులుతూంటే తూలుతూ స్టెప్స్‌వేస్తూంటారు. రెండు గంటల ప్రాంతంలో 'గుడ్ నైట్'లూ



'బాటవ్స్ అప్'లా చెప్పుకుని ఇళ్లదారి పడతారు.

కరుణ ఆలోచిస్తోంది. ఎదురింటి పంజాబీ అంకుల్ ఆంటీసీ పిల్లల్ని తీసుకుని పిక్చర్‌కి 'సిటీ' వెళ్లాడు. తల్లిని అడగమని కబురుచేస్తే 'వాళ్లతో వెళ్లద్దన్నానని చెప్పు. కావాలంటే శంకర్‌ను పంపమని చెబుతాను, లేదా కృష్ణని తీసుకురా! అంటోంది. కరుణకి ఈ మాటలు వినిపించాయి. తల్లి దగ్గరకి వెళ్లి 'నేను సిటీ వెడతాను మమ్మీ నాకు నడిచి వెళ్లాలనుంది' అనాలనుకుంది. కానీ కరుణ మంచం దిగి అంగుళం కూడా కదల్లేక పోయింది.

దూరంగా లక్ష్మీనారాయణ మందిర్ వైపు జనం వెడుతున్నారు. గుళ్లో గంటలు వినిపిస్తున్నాయి. గుడికి వెళ్లాలని మనసు వేధిస్తోంది. కరుణ పసి మనసు ఎంతో ఆత్మ విడిగిపోయింది. 'అదీ తీరని కోరికే' అనిపించిందేమో చిన్నగా నిట్టూర్పు విడిచింది.

'కరుణా' మేనక పిలిచింది.

కరుణ మంచంమీద నుంచి కదల్లేదు. మేనకే రెండు అడుగుల్లో కరుణ గదిలోకి వచ్చింది. బెడ్‌మీద కూర్చున్న పిల్ల చేతిని అలవాటుగా పట్టుకుని 'జ్వరం లేదే... యింకా మంచం మీద నుంచి దిగలేదేమ్మా' అంది.

కరుణ వలి అన్నట్లు సైగ చేసింది. భార్గవ్ వచ్చి కూతురి చేయి అందుకుని వదిలేశాడు.

'ఈసారి సెలవులకి మావూరు పంపిస్తానండి' అంది మేనక.

భార్గవ నవ్వి 'ఆ పల్లెటూర్లో దానికేం పొద్దు పోతుంది? బొంబాయి వెడదాం' అన్నాడు.

కరుణ మనసు చీరాల వెళ్లాలని వువ్విళ్లూరుతోంది. 'డాడీ ఈసారి కాకినాడ, చీరాల వెడదాం అండీ' అంది.

భార్గవ నవ్వాడు: 'అంతకంటే నీకు పక్కలంక, బండార్లంక, బొబ్బర్లంక, సఖినేటి పల్లి, బెండమూర్లంక చూపిస్తాను!'

మేనక వచ్చేనవ్వు ఆపుకుని 'మొత్తం లంకలన్నీ బట్టి పట్టేశారే!' అంది.

కరుణ తండ్రి వైపు ఆశగా చూస్తూ 'ష్యూర్ డాడీ. ఈసారి మనం ఆ లంకలన్నీ చూద్దాం. ఎప్పుడూ సమ్మర్‌లో కాశ్మీర్ తప్ప ఎక్కడికీ వెళ్లడంలేదు. ఈసారైనా మీరు ప్రామిస్‌ని కీపప్ చేసుకోండి' అంది.

భార్గవ భార్యవైపు చూసి 'చెప్పడం మరిచిపోయాను మేనకా. మా బాబాయ్ ఉత్తరం రాశారు. చిన్నటి నుంచీ అసలు యిక్కడ లేనుకదా. ఆయన సెలవలకి నిన్నూ కరుణనీ తీసుకురమ్మని మరీ మరీ రాశారు' అన్నాడు.

మేనక మొహం క్షణంలో రంగు మారింది. నవ్వు తెచ్చుకుంటూ 'నేను రాను - నాకు సెలవు దొరకడం కష్టం అవుతుంది. మీరూ కరుణా వెళ్లి పది రోజుల్లో వచ్చేయండి' అంది.

దర్శన్‌ని డైనింగ్ టేబిల్ మీద భోజన పదార్థాలు వుంచి 'రమ్మని' చెప్పి వెళ్లిపోయింది.

కరుణకి అర్ధరాత్రి నిద్ర పట్టలేదు. రెండు అడుగులు నడిస్తే ప్రిస్టేజ్ అంటూ వెనకాలే కారు పంపిస్తారు. దర్శన్‌తో కబుర్లు చెప్పనీయరు. దర్శన్ ఎంతో మంచి కథలు చెబుతుంది. తల్లి ఎప్పుడు హాస్పటల్‌కి వెడుతుందా, తండ్రి క్లినిక్‌కి ఎప్పుడు వెళ్లిపోతాడా అని ఆలోచిస్తూంటుంది కరుణ. వాళ్లిద్దరూ అటు వెళ్లగానే దర్శన్ ఒళ్లో తల పెట్టుకుని పడుకుని ఆమె చెప్పే కథలు వింటుంది. ఈసారి పల్లెటూరు చూడాలనుకుంటూంటే సెలవలు ఎప్పుడు వస్తాయా అనిపిస్తోంది.


డాక్టర్లిద్దరికీ క్షణం తీరిక వుండదు. వున్న సమయంలో స్నేహితులూ, పార్టీలూ, గెట్ టుగెదర్ పాడావుడి. పిల్లల్ని చేరదీసి ముచ్చటగా మాట్లాడేందుకు మూడు నిమిషాల టైము వుండదు. ఎంతసేపూ పరుగు ... పరుగు ... పరుగు నిలుచుంటే ఆలస్యం అయిపోతుందేమో అన్నట్లు ఒకటే పరుగు. జీవితం యాంత్రికంగా గడిచిపోవడం అంటే ఆ యింట్లో మనుష్యులకే తెలుసు.

కరుణ కిటికీగుండా చూస్తే పంజాబీ భాయీసాబ్ పిల్లల్ని చుట్టూ కూర్చోబెట్టుకుని కథలు చెబుతూండడం కనిపిస్తుంది. ఒక్కోసారి పిల్లలందరూ ఆయన్ని మంచం మీద పడుకోబెట్టి వీపుమీద ఒకళ్లూ, కాళ్ళమీద ఒకళ్లూ నిలుచుని తొక్కుతూంటారు. అతను నవ్వుతూ 'యింకా తొక్కండి' అంటాడు.

కరుణకి ఫక్కున నవ్వు వస్తోంది. కుంభకర్ణుడు పడుకున్నప్పుడూ, గలివర్ పడుకున్నప్పుడూ యిలాగే తొక్కారేమో అనిపిస్తుంది. కరుణ ఆలోచిస్తూనే నిద్రలోకి జారిపోయింది.

* * *

సాయంత్రం ఆరుగంటలైంది. డాక్టర్ భార్గవ నాలుగు గంటలకే క్లినిక్‌కి వెళ్లిపోయాడు. గదిలోంచి పెద్దగా నవ్వితే శబ్దం గాజులు చప్పుడూ వినిపిస్తోంది. కరుణ పరిగెత్తుకుంటూ వచ్చి తలుపు భళ్ళున తెరిచింది. ఆ పిల్ల మొహంలో కత్తి వాటుకి నెత్తురు చుక్కలేదు. తండ్రి మంచంమీద తల్లి వెళ్లికిలా పడుకునివుంది.



ఆమె చేతిమీద తల వుంచుకుని మూర్తి పడుకున్నాడు. తలుపు చప్పుడు విని యిద్దరూ ఉలిక్కిపడ్డారు. మేనక చటుక్కున లేచి కూర్చుంది. కరుణ వెంటనే మేడ మెట్లు ఎక్కి గదిలోకి వెళ్ళి తలుపు మూసుకుంది. ఆ పిల్ల కాళ్ళూ చేతులూ వొణుకుతున్నాయి. డాక్టర్ మూర్తి నాలుగేళ్ళ క్రితం ఆంధ్రా నుంచి వచ్చాడు. ఒకసారి తెలుగు "గెట్ టుగెదర్" ఏర్పాటు చేశారు అప్పుడు అతను కూడా వచ్చాడు ఆ పరిచయం పరిచయం క్రమం తప్పకుండా రోజూ భార్గవ యింటికి వస్తూనే వున్నాడు.

కరుణ అతను నవ్వడం, నవ్వించడం చూసింది కానీ తల్లి పక్కన యిలా యింత దగ్గరగా పడుకోవడం ఎప్పుడూ చూడలేదు. దాదాపు నాలుగేళ్ళ క్రితం ఒకసారి తల్లి గదిలోకి వెడితే సరిగ్గా తండ్రి కూడా అలాగే పడుకుని వున్నాడు. అప్పుడు యిలా భయం వేయలేదు. కాళ్ళు వొణకలేదు. యిప్పుడు మాత్రం కాళ్ళల్లో సత్తువ లేనట్టూ గాలిలోకి తేలిపోతున్నట్టూ అనిపిస్తోంది. సరియైన అర్థం తెలియకపోయినా తల్లి, మూర్తి అంకుల్ పక్కన అలా పడుకోవడం ఏమాత్రం ఒప్పుకోలేక పోతోంది. బయట తలుపు కొడుతున్న శబ్దం అయింది. కరుణా 'కరుణా.. కరుణా' మేనక పిలుస్తోంది.

కరుణ తలుపు తీయలేక పోయింది. కొద్దిసేపు తలుపు కొట్టి కొట్టి మేనక మెట్లు దిగి వెళ్ళిపోయింది. అర్ధరాత్రి మెలుకువ వచ్చిన కరుణకి నిద్ర పట్టలేదు.

గవర్నెస్ కరుణ

కరుణ పుట్టింది మొదలు యిప్పటివరకూ నిద్ర మధ్యలో ఎప్పుడూ లేచి ఎరుగదు!

తండ్రి గదిలోంచి నవ్వులు వినిపిస్తున్నాయి. కరుణ ఆశ్చర్యంగా వినసాగింది. మేనక ఆమెకు తల్లేగానీ ఎప్పుడూ చనువుగా దగ్గరికివెళ్ళి ఎరుగదు. గుడ్ మార్నింగ్, గుడ్ నైట్‌లు తప్ప అందరి పిల్లల మాదిరిగా ఒళ్ళో పడుకోవడం, వొంటిమీద చేయి వేసి నిలబడడం ఏమీ తెలీదు ఆమెకు.

తెల్లవారింది. కరుణ ఆ రాత్రి నిద్ర పోలేదు తల్లిని ఎలా ఎదుర్కోవాలా అని కరుణ ఆలోచిస్తూంటే కరుణ ఏం చెబుతుందో అని బెంగగా తిరుగుతోంది మేనక. మేనక కూతుర్ని చూసీ చూడనట్టు తప్పుకుంది. కరుణ తండ్రి వెనుకే రెండు అడుగులు వేసి తల్లిని చూడడంతో వెనక్కి వెళ్ళిపోయింది.

ఆ రోజు భోజనాల దగ్గర మేనక భర్తతో అంది: 'వేసవి వరకూ దేనికి. కాకినాడ, అక్కడి లంకలూ యివన్నీ ఈ సెలవలకి తీసుకువెళ్ళి చూపించకూడదూ!'

'ఇజ్ ఇట్' ఆశ్చర్యంగా చూశాడు భార్గవ!

'నువ్వేగా అంటున్నది. పల్లెటూరు వెడితే నీ పిల్ల పల్లెటూరి పిల్ల అయిపోదూ.'

మేనక చిన్నగా శబ్దం చేస్తూ నవ్వింది. 'పుట్టుకతో వచ్చిన అలవాట్లు అంత తేలికగా వదలవు. మన పిల్ల హై సొసైటీకి చెందినది. ఆ పల్లెటూరుకి లొంగదేమి?'

కరుణ మనసు మనసులో లేదు. ఇప్పుడు తను తండ్రితో వెళ్ళిపోతే రేపటి నుంచీ మూర్తి అంకుల్‌తో తల్లి రోజూ పడుకుంటుంది అప్పుడు డాడీకి ఎవరు చెబుతారు? మూర్తి అంకుల్ కేం పనిలేదు డాడీ వెళ్ళగానే వస్తాడు ఛీ! నేను వెళ్ళనంటే...

'డాడీ యిప్పుడు వారం రోజులే కదండీ సమ్మర్‌లో అయితే ఎక్కువ రోజులు సెలవు లుంటాయి. అన్నీ తీరికగా చూడచ్చుకదా!'

'మీ మమ్మీ పర్మిషన్ యిచ్చిందంటే వెంటనే చేసేయాలి ఆ పని. ఆ తరువాత ప్రమస్ ఆఫ్ మూడ్స్. ఆవిడ ఆ తరువాత వొప్పుకుంటుందో లేదో?''

కరుణ అంతకంటే ఎక్కువ మాట్లాడలేక పోయింది. ఏం మాట్లాడాలో కూడా తోచలేదు.

ఆ మర్నాడే ప్రయాణం. అనుకోకుండా జరిగిన ఏర్పాటుకి కరుణకి ఆశ్చర్యం ఏమీ వేయడంలేదు. తన తల్లి సమర్థురాలు. ఆ మాట అనుకోకపోయినా అంత దగ్గరగా వచ్చే వూహ ఏదో మెదిలింది ఆ పిల్ల మనసులో.

'రైలుకే వెడదాం. జమ్మూ నుంచి పఠాన్‌కోట్ వరకూ బస్సులో వెడుతూంటే రెండు వైపులా సీన్ చాలా బాగుంటుంది' తండ్రి అన్నాడు. తల్లి ఆ మాటకి 'సరే' అంది.

పిటీ వరకూవచ్చి బస్సు ఎక్కించి వచ్చిందిమేనక. ఆ రాత్రి ఫోన్‌చేసిమూర్తిని పిలిపించింది.ఆమెకు అంతకంతకు దూరం అయిపోతున్నభర్త గురించిగానీ పిల్ల గురించి గానీ బెంగలేదు. ఓ ఖరీదైన సీసాలోంచి కొంచెం బంగారు రంగు(?)... కొంచెం అందమైన గాజుగ్లాసులోపోసుకుని మూర్తితోసహా ఒకే గ్లాసులోది సిప్‌చేస్తూ స్వర్గద్వారాలకి చేరువగా వెళ్ళిపోవాలను కుంటూ కూనిరాగాలు తీస్తోంది. మూర్తి ఆమె నడుము చుట్టూ చేయివేసి ముద్దు ముద్దు మాటల్తో మేనక పెదాల్ని అందుకోవాలని తాపత్రయ పడుతున్నాడు. మేనక అతన్ని పెనవేసుకుని తనవైపు లాక్కుంది.

'యిప్పుడెలా ?' మేనక గంభీరంగా మారిపోయింది.


'ఏమైంది ?'

'అందరికీ ఏమౌతుందో అదే అయింది.'

'వెరీసింపుల్.'

'హో...నాకు నీలాంటి పిల్లాడు కావాలి.'

'నేను చాలదా.'



గవర్నెస్ కరుణ

'రబ్బిష్! అదేంమాట నువ్వు మళ్ళీ, నుకు కొడుకే.'

'ఓ. కే.'

'మనం పెళ్లి చేసుకుందాం.'

'రెండేళ్ళు ఆగాలి.'

మేనక మత్తు వదిలిపోయింది. 'అదేం రెండేళ్ళు దేనికీ వీల్లేదు.' డాక్టర్ భార్గవ మాన్ ఆఫ్ ప్రిన్సిపల్స్. అతను ఒక్క కూతురు చాలు అనుకుని ఆపరేషన్ చేయించుకున్నాడు — మనం ఇలాగా పెళ్ళి చేసుకోవాలనుకున్నాం అని నేను నిర్ణయం చేశాను.'

'నో. మేనకా. మనం డైవర్స్‌కి అప్లై చేసి గానీ పెళ్ళి చేసుకోలేం' అన్నాడు.

మేనక గంభీరంగా మారిపోయింది. 'నీ పోలికలతో పిల్లడు కావాలని కలలు గన్నాను. పిల్లలుంటే మనిషిని మరిచి పోతారు. నా మీద నీకు నిజంగా ప్రేమ వుంటే అది శాశ్వతం అవుతుంది.'

'ఏమో నీ పిచ్చి' మేనక మాటని అతను తేలికగా తీసేసి ఆమెను గాఢంగా పెనవేసుకుని మత్తులో నిద్రలోకి జారిపోయాడు.

* * *

గోదావరి వొడ్డుకి షికారు వెళ్లడం కరుణకి కొత్తగా వుంది. రేవులో లాంచీలు, స్టీమర్లు వున్నాయి. పైన తెల్లని మేఘాలు కొంగలతో పోటీపడి పరుగులు పెడుతూ వుంటే వాటి నీడ ఆ నీళ్లలో స్పష్టంగా కనిపిస్తోంది, పల్లెకారు లోలాయి పదాలు పాడుతున్నారు. దూరంగా బ్రిడ్జిమీద ధన ధన మంటూ రైలు పరుగు పెడుతోంది. సాయంకాలం కావడం వల్ల సూర్యుడు పడమటి దిక్కున అలసిపోయిన తన మొహాన్ని గోదారి అద్దంలో ప్రతిబింబం చూసుకుంటున్నాడు. అక్కడే వున్న గుడిసెల్లోంచి తంపడేసిన తిగల వాసన ఘ్రాణేంద్రియాల్ని ఓసారి పలకరించి పోతోంది. చల్లని గాలులు వచ్చి 'హలో కరుణా' అంటున్నాయి. కరుణ కళ్ళు మరింత వెడల్పు చేసుకుని చూస్తోంది. కాశ్మీరు అందం, గోదారి అందం ఏది బాగుందో యిదమిద్ధంగా తేల్చలేక పోతోంది ఆ చిన్నారి మనసు. తండ్రి ఎడమచేతి చిటికెన వేలు అందుకుని అడుగులో అడుగు వేస్తోంది.

'డాడీ యింక మనం బొబ్బర్లంక ఎప్పుడు వెడతాం? బండార్లంక ఎప్పుడు వెళ్లాలి?' అని అడిగింది.

భార్గవ పిల్లవైపు చూసి 'యిక్కడ బాగుందా, జమ్మూ బాగుందా?' అన్నాడు.

కరుణ కాసేపు మాట్లాడలేదు. ఆ పిల్ల మనసులో పార్క్‌లూ, చలిగాలులూ ఒక్కసారి ప్రవేశించి వూపిరి ఆడ నివ్వడం లేదు. ఆ క్లైమేట్‌లో దూరి చలికి దూరంగా స్వేచ్ఛ లేకుండా పడి వుండడం ఏమాత్రం నచ్చలేదు. 'మనం యిక్కడ వుండకూడదా డాడీ.'

భార్గవ సమాధానం చెప్పలేదు. నవ్వి వూరుకున్నాడు. అతను ఆ రాత్రి రాజమండ్రి అంతా చూపించి వుండడంవల్ల లాడ్జికి తీసుకువెళ్ళి మరునాడు పొద్దున్నే లాంచీలో బొబ్బర్లంక తీసుకు వెళ్లాడు. బొబ్బర్లంక వెళ్లేందుకు గోదారిలో ప్రయాణం కరుణకి చాలా నచ్చింది. పావలాకి ఐదు కోవాబిళ్లలు చూసి ఆశ్చర్యంగా చూసింది తండ్రి వైపు. ఆ పిల్లకి బంధువులు ఎవరెవరున్నారో కూడా తెలియదు యింతవరకు. భార్గవకి వేలు విడిచిన చెల్లెలు బండార్లంకలో వుంటోంది. ఆమె మాత్రమే భార్గవకి అప్పుడప్పుడు వుత్తరాలు రాస్తూ వుంటుంది.


(ఇంకా వుంది)

కాగితం పులి

— ఎమ్. డి. సౌజన్య

గుండెలు మండే ఎండలో
కష్టజీవులు రక్తం పిండుతుంటే—
ఏడంతస్తుల బిల్డింగులో నేను
టిఫిన్ కాఫీ బెస్ట్‌గా సేవించి
పాన్‌తో, సిగరెట్ బిగించి,
సీలింగ్ ఫాన్ సేద తీరుస్తుంటే
కుషన్ ఛెయిర్‌లో కులుకుతూ
శ్రమ జీవుల్లో విప్లవం రావాలని,
శ్రామికులు ఏకం కావాలని
రెడ్డింకుతో రచనలు చేస్తున్నా
కవితలో కన్నీళ్ళు కారుస్తున్నా
భావం విప్లవ మొచ్చిందని జనాన్ని
నమ్మిస్తున్నా!

రూ. 80 విలువ చేసే సొగసుకు మీరిచ్చే వెల కేవలం రూ. 60



అందంగా, దర్జాగా!

పోలియెస్టర్ మిశ్రిత
సూటింగులు మరియు షర్టింగులు,
100% కాటన్, పాప్లిన్స్, డ్రిల్స్, గేబర్డిన్స్,
టస్సూర్స్, ఫుల్ వాయిల్స్, కేంబ్రిక్స్, ప్రింట్స్ మొదలైనవి.
మీరు కోరుకునే రంగులో, డిజైన్లలో–అన్నీ సరసమైన ధరలోనే.

మధురా బట్టలు
తయారు చేయువారు:
మధురా కోట్స్

మధురా సౌత్ ఇండియా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్: 156, వన్టౌన్, విజయవాడ 520 001. మధురా సౌత్ ఇండియా కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ : 7-3-710 రాష్ట్రపతి రోడ్, సికింద్రాబాద్. శ్రీలక్ష్మీ టెక్స్‌టైల్స్, బెసెంట్ రోడ్, గవర్నర్‌పేట, విజయవాడ 520 002.

ధ ర్మ ప థం

ఉపపాండవుల అకాల మృతి

ధర్మరాజు మొదలైన పాండవులయిదు గురికిని ద్రౌపది వల్ల కలిగిన అయిదు గురు కుమారులకును ఉపపాండవులనే పేరు ప్రసిద్ధంగా ఉన్నది. వారు మహావీరులు. అభిమన్యునివలెనే మహారథులు. వారయిదు గురూ అవివాహితులైనందున వారికి సంతానం లేదు. మహారథులైన వీరు అనాథులవలె చాలా దయనీయ స్థితిలో మరణించారు. వీరు నిద్రపోతూ ఉన్నప్పుడు అశ్వత్థామ వీరిని చంపివేశాడు.

'ఇట్టి మహనీయులకు ఇలాంటి పరిస్థితులు ఏర్పడడానికి కారణం ఏమిటి ?' అని ప్రశ్న కలుగుతుంది.

ఇలా జరగడానికి కారణం లేకపోలేదు.

విశ్వామిత్రమహర్షి క్రూర స్వభావుడనీ, కోపిష్ఠి అనీ ప్రసిద్ధి. అతడు ఉత్తమోత్తముడైన హరిశ్చంద్ర చక్రవర్తిని నానా హింసలు పెట్టాడు. ఆ సమయంలో— ఆ కష్టాలను చూచి హరిశ్చంద్రుని యెడల జాలిగొని అయిదుగురు విశ్వేదేవతలు "అయ్యో! ఈ క్రూరుడు ఆ హరిశ్చంద్రుణ్ణి ఎలా కష్టాల పాలు చేస్తున్నాడో! శాంతంగా ఉండవలసిన ముని చెయ్యవలసిన పనేనా యిది? ఈ కఠినుడికిఏట్టి గతివస్తుందో ?" అని తమలో తాము అనుకుంటున్నారు.

ఈ మాట ఎలాగో విశ్వామిత్రుని చెవిలో పడినది. తన్ను నిందించిన ఆ విశ్వేదేవులపైని అతనికి విపరీతమైన కోపం వచ్చింది. ఆ కోపంతో అతడు "నన్ను నిందించిన మీరు భూలోకంలో మానవులయి పుట్టుదురుగాక!" అని వారిని శపించాడు.

మునుల శాపం దే వ త ల కు కూడా అనుల్లంఘనీయం. ఆ శాపానికి విశ్వేదేవులు చాలా భయపడి, ఆ మహాముని కాళ్లపయి పడి తమ తప్పు క్షమించాలని పరిపరివిధాల ప్రార్థించారు. కోపం చల్లారిన ఆ ముని "నేను శపించినట్లు జరగకతప్పదు. కాని, మీరు ఉత్తమ వంశంలోనే ఉద్భవిస్తారు. ఎంతోకాలం భూమిపైని ఉండనక్కరలేదు. యౌవనదశలోనే మీకు హఠాత్తుగా మరణం సంభవిస్తుంది. ఆ వెంటనే మీరు స్వస్వరూపాలతో దేవలోకం చేరుకుంటారు. మీరు అవివాహితులుగానే ఉండడంవల్ల సంతానం, సంసారం గొడవలు ఉండవు." అని అనుగ్రహించాడు.

అందువల్లనే ఉపపాండవులు మహావీరులయి ఉండి, ఉత్తమవంశంలో పుట్టినా వివాహం చేసుకోకుండా అవివాహితులుగానే ఉండిపోయారు. భారతయుద్ధం జరిగిన తర్వాత—నిర్విచారంగా వారు గుడారాలలో హాయిగా నిద్రిస్తూ ఉండగా—అశ్వత్థామ దొంగలా వారున్న కుటీరం ప్రవేశించి చంపివేశాడు. వారికి హఠాన్మరణం కలిగింది.

—బులుసు వేంకట రమణయ్య

అభిమానం చాటున

గొట్టిగుండాల ఇందిరాదేవి



లలిత వచ్చి వెళ్ళింది. వచ్చిన తర్వాత వచ్చిందనే సంతోషం, తృప్తి లేకుండా అయింది.

కారణం. లలిత చెప్పిన విషయం.

ఇది నిజమా! అనే ఆలోచన నాకు కలిగించి పోయింది అసలు విషయం రవి సంగతి.

రవి నాకు సొంత సోదరుడు కాదు. అయితే మా మధ్య వుండే ప్రేమ, ఆత్మీయత అంతకంటె తక్కువైనదేమి కాదు పెద్దమ్మ వరసవుతుంది రవి అమ్మ రవికి నాతో ఎంతో చనువుంది 'ఒరే' అని పిలుస్తుంటాను, నాకంటె మూడేడు పొడవు ఎక్కువ వున్నప్పటికి. వయస్సు, శారీరక ఎదుగుదల మా మధ్య దూరాన్ని పెంచ లేదు. ఇంకా దగ్గర చేసిందనే చెప్పాలి నా కంటే ఒక ఏడాది చిన్న రవి.

రవి చాల సౌమ్యుడు ఖచ్చితంగా చెప్పాలంటే ఫిలాసఫర్స్ చెప్పే మూడు గుణాల్లో సాత్విక గుణము వాడికి వుంది. ఒకరిని తనకి తెలిసి నొప్పించలేదు నే నేదయినా ఖచ్చితంగా, పెద్దగా మాట్లాడితే మౌనంగా వుండేవాడు. చివరకు వాడి చదువు కూడ వాళ్ళ అమ్మా, నాన్నా ఇష్టానుసారమే సాగింది.

"ఎన్నిటా యిది. ఇంత మరీ మెతక అయితే ఎలా బ్రతుకుతావు?" అన్నాను.

"పోనీలేక్కా! వాళ్ళని నొప్పించటం ఎందుకు, నేనే వాళ్ళ యిష్టానుసారంగ మారతాను. పేచీలు వుండవు!" అన్నాడు.

అలా అని తెలివి తక్కువ, అమాయకుడు కాదు. నా అని తను చెప్పని విషయాలు లేవు. తను మగవాడు కాబట్టి బయటి విషయాల్లో బాగా తెలుస్తాయి. నేను ఆడపిల్లని, కొన్ని విషయాలు నాకు చెప్పకూడదు అనే భావమే తనకు వుండేది కాదు ఏదైనా కాని తన మనస్సులో వుండే ప్రతిదీ నాకు చెప్పాలనే తత్వం కలవాడు. కొన్ని నాకు యిష్టం లేకున్నా— తన స్వభావం తెలుసుకోబట్టి "ఊ..." కొట్టే దాన్ని. ఈ విధంగా మా మధ్య బంధం యింకా పెరిగిపోయింది.

"అక్కా... నీకు వచ్చే ఆయన మంచివాడై వుండాలి! నా సెలక్షన్ ఫైనల్. నీకు యిష్టం వున్నా... లేకున్నా నా అభిప్రాయాన్ని కాదన కూడదు"

"అలాగే! నీ యిష్టమే నా యిష్టం" నవ్వేదాన్ని.

చివరకు రవి యిష్టానుసారమే నా వివాహం జరిగింది. ఆయన చాల మంచివారు. ప్రతి ఆడది కోరుకొనేట్టే, నేనంటే ప్రాణంగా, అపురూపంగా చూసేవారు. మా వివాహమయిన తర్వాత ఒక పదిహేను రోజులు నా వద్ద వుండిపోయాడు సామాన్యంగా ఎక్కడా రెండు రోజుల కంటె ఎక్కువ వుండలేడు. కాని, నా దగ్గర వుండటంలో ఆశ్చర్యంలేదుగాని, అందులోని అంతరార్థం నాకు తెల్సు.

ముఖ్యంగా 'నా వైవాహిక జీవితం ఏ విధంగా గడుస్తుంది? మా వారు నన్ను ఎలా చూస్తున్నారు? సుఖపెడుతున్నారు? నా గృహ సారథ్యాన్ని సమర్థవంతంగా నేను ఎలా నడుపుతున్నాను?' అని తెలుసుకోవడానికి వచ్చేడు. ఆ పదిహేను రోజుల్లో ప్రతిదీ పరిశీలనగా చూసేవాడు. వాడి ఆలోచన నాకు తెలుసు కాబట్టి నేనింకా ఆనందంగా వున్నట్లు కనిపించేదాన్ని.

వెడుతూ "నీ సంసారం నాకు తృప్తిగా వుంది. నీకు ఎలాంటి జీవితం లభిస్తుందో అని ప్రతి క్షణం భయపడేవాడిని. నీ జీవితం యిలాగే సాగిపోవాలని భగవంతుని కోరుకొంటున్నాను" అని వెళ్ళిపోయాడు

కొద్దిరోజులకు లలితతో వాడికి పెండ్లి జరిగింది. పదిహేను రోజులు వున్నాను వాడి పెండ్లి కోసం అక్కడ ఇప్పటికి రవి వివాహము జరిగి నెల్రోజులు పూర్తి అయింది.

అభిమానం చాటున

మేమున్న వూర్లోనే వాడికి ఉద్యోగం వచ్చింది. అప్పుడప్పుడు నేను వెళ్లటమో, వాళ్లు రావటమో జరుగుతూ వుంది. ఈ మధ్య రవి వాళ్లు వచ్చి చాలరోజు లయినది. నాకు తీరికలేక వెళ్లలేక పోయాను. ఆ తర్వాత ఈ రోజే లలిత రావటము! లలిత చెప్పిన విషయాలు నన్ను ఆశ్చర్యాన, విచారాన ముంచినవి.

"ఏం చేయాలి?" అనే ఆలోచన నాకు. ఇక్కడ వుండి పడే బాధ కంటె క్రొద్ది రోజులు రవి దగ్గరే వుండాలి' అని నిగ్రయించుకొన్నాను

*   *   *

రాత్రి తొమ్మిదైంది. రవి యింకా రాలేదు.

"లలితా... రవి ఆఫీస్ ఎంతవరకు..."

"అయిదుకే వదిలేస్తారు!"

ఇప్పటికి ఆఫీసు వదిలి నాలుగు గంటలయినది. రాత్రి శ్నిం ఎక్కడెక్కడ తిరుగుతున్నాడో! నేను లలిత ప్రోద్బలంతో భోజనం చేసాను రవి రాకున్నా. పదిన్నరకేమో రవి వచ్చాడు. నేను రూంలో నుంచి వెలుపలికి వెళ్లలేదు. కాసేపు జరిగింది! రవి భోజనానికి కూర్చున్నాడు.

"ఏమిటీ అన్నం. ఎలా తినాలి?" రవి గొంతు.

"పదిన్నరయింది. యిప్పటికి చల్లగా వుండక వేడిగా ఎలా వుంటుంది!" లలిత జవాబు.

"సమర్థించుకోవటం బాగానేవుంది, అక్కడ చాకరి చేసి వస్తే యిక్కడ సరిగా తిండి కూడ పెట్టలేవు!" రవి గొంతు తీవంగా వుంది.

అంతలోనే రవి వావ్ుటింగ్ చేసుకొంటున్నట్టు శబ్దం వచ్చింది.

"మీరీ అలవాటు మానారా? లేక నన్ను వెళి పొమ్మంటారా?" లలిత కోపంగా అంది

"నేనేమి కాని పనులు చేస్తున్నాను, నీవు వెళి పోవడానికి" చిరాగ్గా అన్నాడు.

"ఇవనీ కానిపనులు కాక యింకేమిటి?" నిలదీసింది లలిత

"అనవసరంగా మాట్లాడితే పళ్లు రాల్తాయి..." యింకేదో అనబోయాడు. లలిత మధ్యలోనే "పద్మక్క వచ్చివుంది" అన్నది

"ఏది? ఎక్కడా?" అన్నాడు.

"నిద్రపోయిందా? మేల్కొనివుందా?" నెమ్మదిగా మాట్లాడుతున్నాడు.

"ఏమో నాకు తెలియదు" అని వెంటనే "నిద్రపోయే వుంటుంది. యింకా మేల్కొని వుండను ఎవరితరం అవుతుంది." అంది లలిత.

తర్వాత నాకేమి వినిపించలేదు. 'వస్తాడేమో' అనుకొన్నాను. ఎప్పుడైనా వస్తే నన్ను నిద్ర లేపయినా పలుకరించిగాని పోయేవాడు కాదు. నేను కాసేపు చూసి యింక రాడని నిద్రపోయాను.

తెల్వారి ఏడుగంటలకు గాని రవి నిద్ర లేవలేదు. లలిత వంట యింటో టిఫిన్ చేస్తుంది. నేను రవి కోసం ఎదురు చూస్తున్నాను

ఎప్పుడు లేచి వచ్చాడో "శుభోదయం పద్మక్కా... ఏమిటీ హఠాత్తు ఆగమనం" సంతోషంగా అన్నాడు.

'నీవు మరిచినా నేను మరువను గదా! గుర్తున్నానో- లేదో? అని పలుకరించ వచ్చాను' అని అందామనుకొన్నాను. కాని ఏదో నిశ్చయానికొచ్చి మౌనంగా వుండిపోయాను

"ఏమిటండీ.. ఈ మౌనానికి అర్థం?" అన్నాడు తమాషాగ.

"ఏముందిలే!" నీరసంగ జవాబిచ్చాను.

నావైపు నిచితంగా చూసి, "లలితా... యిలారా..." అని భార్యను పిలిచాడు. లలిత వచ్చింది.

"ఏమిటి? మా అక్కకు ఏమైనా కోపం వచ్చిందా? నాతో సరిగా పలకడం లేదు నీకేమైనా తెలుసా?" అన్నాడు.

"నాకేమి తెలియదు. ఆమె రాత్రి వచ్చిన దగ్గరనుంచి అలానే వుంది నాతో కూడ ఏం మాటాడలేదు." అని అక్కడ వుండకుండా వెళ్లిపోయింది.

రవి కాసేపు మాట్లాడలేదు. ఏమనుకొన్నాడో తర్వాత "రాత్రి నేను వచ్చేసరికి పొద్దుపోయింది. పలుకరిస్తామనుకుంటే నిద్రపోయావని లలిత చెప్పింది" అని మాత్రం అన్నాడు.


నేను "ఊ..." అన్నాను. తర్వాత చాల సేపు ఏదేదో మాట్లాడాడు. ముక్తసరిగా జవాబిచ్చాను. తను ఆఫీస్ కెళ్ళాడు కాసేపు తర్వాత, నాలుగురోజులు గడిచాయి.

ఆ నాలుగురోజుల్లో లలిత చెప్పినట్టుగా రవి ప్రవర్తన లేదు. చక, చక ఎప్పటిలా మాట్లాడుతున్నాడు. వచ్చినరోజు చూసాను కాబట్టి నమ్మకం పోలేదు.

"బావగారు ఈ మధ్య కనిపించనే లేదు." అన్నాడు.

నేను జవాబేమి చెప్పలేదు.

కాసేపు నాకేసి చూసి "వచ్చిన దగ్గరి నుంచి చూస్తున్నాను. నీవేదో నా నుంచి దాస్తున్నావ్! ఈ మౌనం, ఈ దిగులు ఏమిటో నాకు అంతు పట్టడంలేదు. బావ గారి పైన అలిగి వచ్చావా? ఇప్పుడే వెళ్ళి తేల్చుకొని వస్తాను" లేచి నిల్చున్నాడు.



అభిమానం చాటున

"వద్దూ..." నేను రవి చేతిని పట్టు కొన్నాను.

"నీవు 'ఏమిటి' అని చెప్తేగాని నేను వుండను." అని మొండిగా అన్నాడు.

"సరే! కూర్చో చెప్తాను."

నా ఎదురుగా కూర్చున్నాడు.

"ఈ మధ్య మీ బావగారు నాతో సరిగా వుండడంలేదు." మొదటి పాయింట్‌గా చెప్పి తన వైపు చూసాను. వినరానిదేదో వింటున్నట్టు ముఖం పెట్టాడు.

"ప్రతిరోజు అర్ధరాత్రికిగాని యింటికి రారు. అంతవరకు యింట్లో ఒక్కదాన్ని వుండాలంటే ఎంత కష్టమో చెప్పు?..."

అంతలోనే లలిత వచ్చి ఆ మాటలు విన్నది. "ఈ మగాళ్ళు అందరూ యింతే." అన్నది.

"నీవు వూర్కో!" అన్నాడు రవి లలితని.

"అర్ధరాత్రి రావడమేకాదు. త్రాగి వస్తున్నారు, ఆ త్రాగుడు మైకంలో ఏలాంటే అలా తిట్టడం, కొట్టడం, నీవు వెళ్ళిపో! ఎదురు తిరిగితే అనేమాట. ప్రతిపూటరచ్చ, అనవసరంగా జగడం పెట్టుకొంటారు." వెక్కిళ్ళు వచ్చాయి దుఃఖంతో నాకు.

"నేను ఆ యింట్లో కాపురం చేయలేను, చావనైనా చస్తానుగాని" అన్నాను.

"నిజంగా బావ అలా మారినారా? ఎంతో మంచివాడిగా వుండేవారు" అన్నాడు రవి.

"అందరూ అంతే పైకి బాగ వుంటారు. లోపల చేసేవన్నీ చేస్తుంటారు వాళ్ల తప్పు వాళ్లు తెలుసుకోలేరు" ఖచ్చితంగా అంది లలిత.

"నీవు అన్నిటికీ నేనవిరాకు..." ఆసహనంగా అన్నాడు రవి.

"నిజం చెప్తే అందరికీ కోపాలే!" ఇంక లలితను మాట్లాడిస్తే ఏం అంటుందోని భయంతో "నీవు లోపలికెళ్ళు లలితా అనవసర ప్రసంగం చేయకు" అన్నాడు.

లలిత అక్కడ వుండకుండ లోపలికి వెళ్ళిపోయింది.

నా కంటినిండా నీరు.

"పద్మక్కా... ఏడవకు. నా కెంతో బాధ వేస్తుంది" అన్నాడు. రవి కళ్లలో కూడ నీరు తిరిగి వున్నాయి. నేనంటే ప్రేమ, అభిమానం అలానే వున్నాయని రవి పడే బాధవల్ల గ్రహించాను

"లేదు. నేనక్కడ వుండలేను ఎన్ని రోజులు భరించేది ఈ బాధ! మీరు ఎంత మగవాళ్లయినా... ఆడది మీ అండనేవున్నా అంత బాధకు గురి చేయకూడదు. మేము మనుష్యులమే. మీలాగే మాకు సంతోషం, శాంతి, సుఖం కావాలి. ఆ విషయం మీ మగవాళ్లు ఆలోచిస్తే బాగుంటుంది?" కోపంగా అన్నాను.

మౌనంగా వింటున్నాడు. జవాబు ఏం చెప్పలేదు.

"రవి! నన్ను అమ్మ దగ్గరకు తీసుకెడతావా? తీసుకెళ్ళు. లేదా యిక్కడే ఎక్కడన్నా పడి చావనైనా చస్తాను కాని ఈ బాధ భరించే శక్తి నాకు లేదు!" వెక్కిళ్ళు పెడుతూ ఏడ్చాను.

నా ఏడుపు రవి భరించలేక పోయాడు.

"ప్లీజ్ పద్మక్కా నీవు అలా వుండకు. ఏదో విధంగా నేను సరిచేస్తాను."

"ఎలా సరిచేస్తావ్?" కళ్ళు తుడుచుకొంటూ అడిగాను.

"బావగారిని విడదీస్తాను. నిన్ను మరీ యింత కష్టపెడుతున్నాడా?"

"హుం... కష్టమా? రోజూ త్రాగడం, ఆలస్యంగా యింటికి రావడం, తిట్టడం, కొట్టడం. ఏ ఆడది ఎంత కాలం భరిస్తుంది? నీవు చెప్పు?" అన్నాను.

"నీవు మొదట్లోనే చెప్పి వుండాల్సింది. అసలు నీవు యింతవరకు రానివ్వాల్సింది కాదు..."

ఆ మాటతో సర్రున లేచాను. "ఏం చెప్పమంటావ్? మొదట్లోనే. ఒకరోజు త్రాగి వస్తే 'తమాషాగా ఫ్రెండ్స్‌తో త్రాగాను' మరోరోజు అదేమాట. ఇంకోరోజు 'యింక త్రాగను'; తర్వాత 'నా యిష్టం. నీకెందుకు. నీవు మాట్లాడకుండా పడివుండు. నోరుమూసుకో! చంపేస్తాను ఇంకా ఎదురు పల్కావంటే' యిలా... రోజు రోజుకి పెరిగి పోయేప్పుడు నేను మాత్రం ఏలా కంట్రోలు చేసేది, నీవు చెప్పు?" నాలోని బాధంతా కోపంగా బయట పడింది.

రవి ఏంమాట్లాడలేదు. ఏదోఆలోచనలో

(36 వ పేజీ చూడండి)

ప్రారంభం!


నిషధ బహు సుందరమగు రాజ్యము. నలుని ఏలుబడిలో వన్నెకెక్కినది. అతని పరిపాలన ప్రజానురంజకమైనది.
2-65 279
నలుడు కడు రూపసి. ఓటమినెరుగని వీరుడు. గుణవంతుడు. అతడు ఒకనాడు తన ఉద్యాన వనమున విహరించుచు అందు దండు విడిసి యున్న హంసల మందు నందు ఒక హంసను ఒడిసి పట్టెను... అంత ఆ హంస మానవభాషలో
?
నలమహారాజా! నీవు ప్రేమించుచున్న దమయంతి యొద్దకు పోయి నీ గుణములు వర్ణించి నీపై గాఢానురాగం కలిగేలా చెప్పెదను దయయుంచి నన్ను విడువుము.
2-66 280
నలుడు అమితానందమును పొందుచు హంసను వదలెను. అది తన గుంపుతో కలసి అల్లనల్లన ఎగురుచు విదర్భ దేశమున దమయంతి చెలులతో నున్న ఉద్యాన వనమున దిగెను.
ఈ ఒయ్యారపు హంసను సడి చేయక మెల్లగ పట్టుకొనెదను....
దమయంతీ! అతిలోకసుందరి వగు నీకు ఆ నలమహారాజే తగిన జోడు. రూపవయో గుణ సంపదలయందు అతనికి అతడే సాటి........
...హంసరాజమా! నలుని గుణములు నాకెరిగించితివి నలునకే... నన్నూ ఆ లేని కెరిగించి పుణ్యము గట్టుకొనుము.
నీ కోరిక సఫలము చేస్తాను రాకుమారీ
2-67 281
ఏమమ్మా! ఈ మధ్య మా దమయంతి మునుపటి జాడ లేదు ఏమి చేయుచున్నది?
అవును మహారాజా! కొన్ని రోజుల క్రితం మేము ఉద్యానవనములో నుండగ ఒక హంస రాకుమారి చేత జిక్కి ఎవరో నలమహారాజట. నిషధాధీశ్వరుడట. వాని సర్వ గుణ సౌందర్యములు వర్ణించి చెప్పినది........
హంస పలుకులు విన్నది మొదలు రాకుమారి నిద్రాహారములు మాని అలంకరణ చేసి కొనక ఏదో మూగ బాధ ననుభవించుచున్నది
అదియా సంగతి! ... సరే! మీరు వెళ్ళండి....
[ఇంకా వుంది]
2-68 282



సీరియల్

ఆకర్షణ-వ్యామోహం

కవనశర్మ

(గత సంచిక తరువాయి)

వనజ టి. వి. ఆన్ చేసింది. విజిటింగ్ ఆఫ్రికన్ టీమ్ చెస్తున్న డాన్సు జరుగుతోంది. అందరు టాస్‌లెస్‌గా ఉన్నారు. పార్వతి సిగ్గు పడింది.

"ఆర్పెయ్యి" అంది లక్ష్మి.

"పాపం శంకరరావుగారు చాలా ఉత్సాహంగా చూస్తుంటే!" అంది వనజ. శంకరరావు నవ్వి ఊరుకొన్నాడు.

ఈ పిల్లకి బొత్తిగా సిగ్గులేదు అనుకొంది పార్వతి. ఈ పెద్దమనిషి చిరునవ్వు నవ్వి ఊరుకొన్నాడు. వయస్సులో ఉన్న పరాయి స్త్రీ, పురుషుల మధ్య ఈ సంభాషణ పార్వతికి నచ్చలేదు

"బాబుకి నిద్ర వస్తోంది. మేం వస్తాం" అంటూ లేచింది.

"లైసెన్సు, రాగానే చెప్పండి" అన్నాడు రంగస్వామి లేస్తూ.

శంకరరావు, పార్వతి బాబుని తీసుకొని వీధిలోకి వచ్చాక "నిన్న షీలా వాళ్ళింటికి వెళ్ళాం. ఆవిడ వాంతుల్తో బాధపడ్తోందిట బెడ్‌మీద వుంది. ప్రెగ్నెంసీ తాలూకు మార్నింగ్ సిక్‌నెస్ ఏమో అనుకొన్నాను. కాదుట" అంది పార్వతి.

"తను ప్రెగ్నెంటని అనుకోను" అంది లక్ష్మి.

"మరి అంత డోకులేమిటో. ఈ దేశంలో కలరా రాదుకదా!"

"ఏమో ఆవిడకి నెలకోసారి ఇది మామూలే ఎందుకు అవుతాయో గాని. ఏమన్నా ఎలర్జీ వుందేమో కొన్ని తినేవాటిపట్ల, తనకి తెలియకుండానే."

"మమ్మీ! మరొందుకుకూడా వామిటింగ్స్ అవుతాయి. ఆ కారణం ఎక్సెసివ్ డ్రింకింగ్. షీల చేపలాగా తాగుతుందేమో" అని కలిపించుకొంది వనజ.

"షీల తాగదు వనజా!" అంది లక్ష్మి కోపంగా.

"పబ్లిక్‌లో తాగదు. వైఫ్ అండ్ హజ్బెండ్ ప్రవేట్‌గా బాటిల్స్ ఖాళీచేస్తారేమో! తను స్ట్రిక్ట్ వెజిటేరియన్ అని మనతో చెప్తుంది. నేనోసారి సడెన్‌గా వెళ్ళేసరికి, మా యూని కేదో పనిమీదవచ్చినట్టుంది. కృష్ణ, షీల మా కాంటీన్‌లో హంబర్గర్స్ తింటూ కనిపించారు" అంది వనజ. వనజకి ఇండియన్సెందుకు తాగుతూ తాగమని, మాంసం తింటూ తినమని చెప్పుకొంటారో అర్థంకాదు. మేం తాగుతాం అంటే ఎవరైనా వాళ్ళని చంపుతారా అనుకొంటుంది. ముఖ్యంగా ఇండియన్ విమెన్‌కి ఈ ప్రిటెంసెస్ ఎక్కువ. ఒకసారి తల్లితో ఈ మాటే అంటే "మాంసం తింటామకదా అని ఎముకలు మెళ్ళో కట్టుకు తిరుగక్కరలేదు" అంది.

"మెడలో కట్టుకొని తిరగక్కర్లేదు. అల్లా అని గొయ్యి తీసి పాతిపెట్టక్కర్లేదు. జస్ట్ త్రో దెమ్ ఇన్ ది గార్బేజ్ టిన్" అంది వనజ. లక్ష్మికి భారతదేశపు పరిస్థితులు తెలుసు. వనజకి సరిగ్గా తెలియవు. అంతే తేడా. అందుకని లక్ష్మి చర్చ అక్కడతో ఆపేసింది.

"వనజా! డియర్! ఇతర్ల గురించి మన కెందుకు గొడవ. కారణం ఏదైనా షీల ఆ రెండ్రోజులు బాధపడ్తుంది. ఇష్టముంటే వీలైతే సహాయం చేద్దాం. లేకపోతేలేదు. అంతేగాని వాళ్ళని గూర్చి చర్చించద్దు" అన్నాడు రంగస్వామి.

"గుడ్‌నైట్ శంకరరావు అండ్ పార్వతి."

"గుడ్‌నైట్. వస్తాం" అంటూ శంకరరావు బాబు నెత్తుకొని బయల్దేరాడు. రంగస్వామివాళ్ళు కనుమరుగయ్యాక పార్వతి, శంకరరావు చెయ్యి పట్టుకొని నడిచింది. అల్లా రొమాంటిక్‌గా నడవటం పార్వతి కిష్టం. అల్లా నడుస్తున్నప్పుడు ఆస్ట్రేలియన్సు తెలిసినవాళ్ళు చూసినా సిగ్గుపడదు. ఇండియన్సు తెలిసినవాళ్ళ కంట పడకుండా జాగ్రత్తపడుతుంది.

శంకరరావు ఆ మర్నాడు ఒక్కో పోలీస్ స్టేషన్‌కి ఫోన్‌చేసి టెస్టుకి ఎప్పుడు రానని అడిగాడు. వాళ్ళు పదిరోజుల తరువాత అని చెప్పారు.

"ఈలోపల నా ఇండియన్ లైసెన్సుతో డ్రైవ్ చేయవచ్చా?" అని అడిగాడు.

"ఈ దేశం వచ్చి ఎన్నాళ్ళైంది?"

"ఆరునెలలు."

"మీ లైసెన్సుమీద మూడు నెలలపాటు డ్రైవ్ చెయ్యొవచ్చు. ఆరునెలలు దాటేలోపల ఆస్ట్రేలియన్ లైసెన్సు తీసుకోవాలి.' '

"టెస్టుకి మరో పదిరోజులుందికదా ఈలోపల డ్రైవ్ చేస్తే."

''చేస్తే పరవాలేదు. చేస్తూ దొరికితే పనిష్ చేస్తాం'' అన్నాడు అవతలనుంచి నవ్వుతూ.

''థాంక్స్'' అంటూ శంకరరావు ఫోను పెట్టేసాడు.

పదోరోజున శ్రమలేకుండానే ఓరల్ టెస్టులో పాస్ అయ్యాడు. బాంక్‌లో రెండువందల డాలర్లు ఓవర్‌డ్రాఫ్టు చేసి తీసుకొన్నాడు. ఆ డబ్బు రంగస్వామి కిచ్చి మిగిలిన మూటయాభై డాలర్లు పై నెల ఇస్తానన్నాడు. రంగస్వామి శంకరరావుకి కారు ఇచ్చాడు. కారు ఇంటికి వచ్చింది.

కార్లో పెద్దామంటే వెంకటేశ్వరస్వామి బొమ్మ లేకపోయింది. కాని ఈ దేశంలో వున్న ఇన్ని లక్షల కార్లలోను ఒక్క కార్లోను వెంకటేశ్వరస్వామి ఫొటో లేదు. సాయిబాబా ఫొటో లేదు. వాళ్లందర్ని క్షమించిన దేవుడు తన్నిమాత్రం క్షమించడా! అమాటే పార్వతితో అన్నాడు. పార్వతికి ఏం చెప్పాలో తోచలేదు. రెండు నిమ్మకాయలు తీసుకువచ్చి చక్రాల క్రింద పెట్టింది. అవి దొర్లిపోయాయి. కష్టపడి శంకరరావు, పార్వతి వాటిని చక్రాల కిందకి జేర్చారు.

''వాటినేం చేస్తారు?'' అని అడిగారు చూస్తూ నిలబడిన ఆస్ట్రేలియన్సు.

''వాటిమీదనుంచి చక్రాలని పోనిస్తాం'' అన్నాడు శంకరరావు.

''ఎందుకు?''

జరిగిన కథ - 5 : కొత్త జీవితం గడపటానికి స్వదేశం నుండి ఆస్ట్రేలియా వెళ్లిన శంకరరావుని, పార్వతిని — రంగస్వామి, ప్రొ. బ్రౌన్‌లు సాదరంగా ఆహ్వానించి వాళ్ల ఫ్లాట్‌కి తీసుకువెళ్తారు. పార్వతి టీచర్ ఉద్యోగానికి ప్రయత్నించి నిరాశ చెందుతుంది. తర్వాత కొన్నాళ్లకు ఒక బట్టల కంపెనీలో ఉద్యోగానికి చేరుతుంది. ఉన్నంతలో 'వినాయక చవితి' పండుగ జరుపుకుంటారు శంకరరావు దంపతులు. శంకరరావు పనిచేస్తున్న యూనివర్శిటీలోని విద్యార్థులు తమ జీతాలు తగ్గించాలని ఆందోళన చేస్తుంటారు. శంకరరావు, రంగస్వామి కారును కొందామని ప్రయత్నాలు జరుపుతుంటాడు.

అల్లా చేస్తే కారు మరి బలి కోరదని, ప్రమాదాలు జరగవని మా నమ్మకం అనడానికి శంకరరావుకి ధైర్యం చాలలేదు నవ్వుతారేమోనన్న అనుమానం వేసింది. ఆయుధపూజ గొప్పతనం గురించి చెప్పలేదు. దసరా గురించి చెప్పలేదు.

''అది లక్ తెస్తుందని మా నమ్మకం'' అన్నాడు.

''ఓ. ఇంటరెస్టింగ్'' అన్నారు వాళ్లు. వాళ్లు కూడా అల్లాంటివి లక్షలాంటివి చేస్తూవుంటారు.

ఆ విధంగా దండలు, పటాలు, అగరవత్తులు లేకుండా కారు వాడటం శంకరరావు మొదలు పెట్టాడు. పార్వతి టీచర్ ట్రెయినింగ్‌లో జేరింది. ప్రతిరోజు బాబుని బేబీసిట్టర్ జోన్ దగ్గర వదిలేసి ఆపైన పార్వతిని కాలేజీలోను, ప్రాక్టీస్‌వున్న రోజున స్కూల్లోను దింపేవాడు. కాలేజీ నుంచి తనే కార్లో ఇంటికి తీసుకు వెళ్లేవాడు సాయంత్రాలు. స్కూలు నుంచి పార్వతి కొలీగ్ ఒక ఆస్ట్రేలియన్, ఇంటిదగ్గర దింపేవాడు. అతను అటువేపుగానే వెళ్లాలి. దింపుతానని అతనంతట అతనే ఆఫర్ చేసాడు.

వీళ్లు ఒకళ్లకొకళ్లు సహాయం చేసుకొంటారు. మనకి చేస్తారు అనుకొంది పార్వతి. మన దేశంలో చస్తే చెయ్యరు. పైగా ఒక ఆడదాన్ని పరాయి మొగవాడు కార్లో తీసుకువచ్చి దించితే ఇంకేమన్నా వుందా!

ఆస్ట్రేలియన్ సిస్టమ్‌ని మెచ్చుకొంటూ పార్వతి ఓరోజు శంకరరావుతో మాట్లాడింది. శంకరరావు నవ్వి,

''నేను ఒకరోజు ఇండియాలో వున్నప్పుడు నా స్కూటర్‌మీద, ప్రెగ్నెంటుగా వుండి నడవటానికి శ్రమగావున్న మాలతి, నా దార్లో వాళ్లింటి దగ్గర దింపానని నువ్వు ఎంత గొడవ చేసావ్! ఊళ్లో అందర్ని మీరే రక్షిస్తారా? అని అడిగావు. అవసరం మనదైనప్పుడు మరోలా ఆలోచిస్తాం'' అన్నాడు.

''స్కూటర్‌మీద మరీ అసహ్యం. పరాయి మగాడి వళ్లో తగుల్తూ ఆ మాలతెల్లా కూర్చుందండీ మరీను. నేనల్లా ఛస్తే ఎక్కను. కార్లో ఎవరి సీటు వాళ్లది కదా దీనికి దానికి పోలికేమిటి'' అంది పార్వతి.

7

శంకరరావు యూనివర్శిటీ నుంచి అయిదు గంటలకు బయల్దేరి మొనాష్ టీచర్స్ కాలేజీకి వెళ్లాడు. లైబ్రరీలో చదువుకొంటున్న పార్వతిని కార్లో ఎక్కించుకొన్నాడు. పార్వతికి మూడింటికే క్లాసులైపోయినా ఎసైన్‌మెంట్స్ చేస్తూ శంకరరావు వచ్చేవరకు కూర్చుంటుంది. పార్వతిని ఎక్కించుకొని బేబీసిట్టర్ జోన్ ఇంటికి వెళ్లాడు. పార్వతి లోపలికి వెళ్లింది బాబుని తీసుకురావడానికి. పార్వతి బిస్కెట్ తింటున్న బాబుని తీసుకొని వచ్చింది. ఆమె వెనకాతలే జోన్ వచ్చింది. జోన్ మామూలుగా చాలా ట్రిమ్‌గా తయారై వుంటుంది. ఎంతోమంది పిల్లల్ని కనిపెట్టుకొని వున్నా మొహంలో ఎప్పుడూ అలసట కనిపించదు. అల్లాంటిది ఆరోజు మొహం పీక్కుపోయుంది. జుట్టు దువ్వుకోకుండా దాన్ని ఓ రిబ్బన్‌ముక్క కట్టి ఊరుకొంది. అంతకుముందుదాకా ఏడ్చినట్టు కళ్లు ఎర్రగా వున్నాయి

''ఆంటీ...'' అన్నాడు బాబు తండ్రితో.

''వాళ్ల అబ్బాయి హారీ యివాళ ఇల్లు వదిలిపెట్టి పోయాడుట.''

''శంకూ! హారీ ఏం చేసాడో తెల్సా! వెళ్లి హరే ర్నామ్ హరే కిష్ణలో జేరాడు నా కంతకంటే విచారకరమైన విషయం లేదు. అక్కడ్నుంచి ఫోన్ చేసాడిక యింటికి రానంటూ. తల్లి మనస్సెంత బాధపడ్తుందో వాడికి తెలియదు. వాళ్ల నాన్నని పంపాను. రానన్నాడు. అక్కడున్న వాళ్లంతా బ్రోకెన్ ఫామిలీస్ నుంచి వచ్చిన పిల్లలు. ఆ అలగాసజ్జుతో నా కొడుకు జేరాడు శంకూ'' అంటూ జోన్ కళ్లనీళ్లు పెట్టుకొంది.

''జోన్! నువ్వు దీన్ని కొంచెం నిబ్బరంగా తీసుకోవాలి. అబ్బాయికి యివాళ కాకపోయినా రేపైనా మంచేదో చెడేదో తెలుస్తుంది. మళ్లీ

ఆకర్షణ - వ్యామోహం

మీదగ్గర కొస్తాడు'' అన్నాడు శంకరరావు కారు దిగి.

''రాడు. ఆ మిషన్‌ని కాల్చేసి బూడిద చేస్తేకాని రాడు.''

''కొందరికి ఆధ్యాత్మికచింతన ఎక్కువగా వుంటుంది. హారీకి అది కొంచెం ఎక్కువ.''

''పేడ! నా భాషని క్షమించండి. ఇది మరో దేశపు కుళ్లు నాగరికతపట్ల వ్యామోహం. ఎస్కేపిజం. హారీకి కష్టపడి మెట్రిక్ పాసయ్యే ధైర్యం సన్నగిల్లింది. అటువంటివాళ్ల కిదో మత్తుమందు.''

శంకరరావు దెబ్బతిన్నాడు. అతనికి కృష్ణ కాన్షస్ గురించి పెద్దగా తెలియదు. ఏదో గుడి కట్టాం అంటూ చలిలో వంటిపొరగ, పంచెలు కట్టుకొని చీరలు కట్టుకొని పాటలు పాడుతూ చందాలు అడిగితే ఒక డాలర్ చందా యిచ్చాడు. అతనికి అదో మంచి సంస్థ అని, అది పాశ్చాత్యులకి భారతదేశపు మత విశ్వాసాలు, అతి ప్రాచీనము ఉత్తమము అయిన ఆధ్యాత్మిక చింతన పంచిపెడుతోందని, ప్రాపంచిక చింతనలేకాని పాశ్చాత్యులకు ఆధ్యాత్మికచింతన లేకపోవడంచేత వారికీ జ్ఞానం భారతీయులు పంచిపెట్టాల్సిన అవసరం చాలా వుందని నమ్ముతూవచ్చాడు. అయితే దీంతో మనం ఆకర్షిస్తున్నది బుద్ధి వికసించని పిల్లల్నా? ఆ పిల్లల తల్లిదండ్రుల మనస్సులో యిది ఆరని మంటలు రగులుస్తోందా? ఆ మంటలు ఆ సంస్థని కాల్చి బూడిద చెయ్యాలని నాలుకలు చాస్తోందా? అయితే చక్కని కుటుంబాలలోంచి వచ్చిన పిల్లలకిది ఏవిధమైన ఆసక్తి కలిగించటంలేదుకదా! ఆలోచించగల పెద్దల కిది ఈవిధమైన ఆధ్యాత్మికచింతనపట్ల కుతూహలం కలిగించటం లేదెందుకని? ఆర్తుల కోసమా ఇది? ఈ ఆర్తులందరికి వున్న బాధలు ఇహపరమైనవేకదా! వాటిని మర్చిపోవటానికీ మతం మత్తుమందులా చేస్తోందా? ఇది కేవలం విదేశీయమైనది కొత్తది అవటంవల్ల వ్యామోహంతో అనుసరిస్తున్నారా? ఈ ఆర్తులకి, ఇహపరమైన బాధలు తొలగిస్తే ఈ పవిత్రమైన హిందూ వేదాంతం అక్కర్లేకపోతుందా? లేక ఈ మత్తు దిగిపోగానే మరో మత్తు కలిగించేది వెతుక్కుంటూ వీళ్లంతా వెళ్లిపోతారా?

''ధైర్యం కూడగట్టుకోవాలి జోన్! నేను కూడా హారీతో ఓసారి మాట్లాడ్తాను'' అన్నాడు శంకరరావు.

పార్వతి జోన్‌ని ఓసారి దగ్గరకు తీసుకొని వీపుమీద మెల్లిగా తట్టి ''వస్తాం'' అంది.

బాబు చెయ్యి ఊపాడు. శంకరరావు కారు ఎక్కి స్టార్ట్ చేసాడు.

''ఆదివారాలు పూజుంటుందిట. ఈ ఆదివారం వాళ్ల గుడికి వెళ్దాం'' అన్నాడు శంకరరావు.

''అల్లాగే వెళ్దాం. జోన్ మన పిల్లాడిని రోజుకి ఎనిమిదిగంటలు పైగా చూసిపెడ్తుంది. మంచి నడవడి నేర్పడానికి ప్రయత్నిస్తుంది. మనం ఏడాదిలో మొదటిసారిగా తన కొడుకుతో పది నిముషాలు గడపడం ధర్మమే. గుడంటున్నారు. అక్కడ కొబ్బరికాయలు కొట్టచ్చా?'' అని అడిగింది పార్వతి.

''కొట్టొచ్చేమోగాని ఎందుకు?''

''నాకు టీచర్స్ ట్రెయినింగ్‌లో సీటు వస్తే వెంకటేశ్వరస్వామికి కొబ్బరికాయ కొడ్తానని మొక్కుకున్నాను.''

''అక్కడ వుండేది కృష్ణుడు బొమ్మ. వెంకటేశ్వరస్వామిది కాదు.''

''కృష్ణుడు వెంకటేశ్వరస్వామి ఒకటే. రూపాలు వేరు అంతే!''


ఒకటే అయినప్పుడు వెంకటేశ్వరుడికే కొడ్తానని ఎందుకు మొక్కుకుందో పార్వతికి తెలియదు. ఆ సందేహంకూడా రాలేదు.

''కాని యిక్కడ సరైన కొబ్బరికాయలు పిలకున్నవి దొరకవు. పిలకలేని కొబ్బరికాయ కొట్టరాదు. అందుకని కొబ్బరికాయల బదులు ఓ పది ఆపిల్స్ ఇచ్చేయి.''

''ఛ!''

''రూపాలు వేరుకాని అన్ని ఫలాలు ఒకటే'' అంటూ నవ్వాడు. శంకరరావు కిప్పుడిప్పుడే మతం పట్ల వెర్రినమ్మకం సడలి మతంలోని పూజా పునస్కారాల్లో అవకతవకలలాంటివి, హిందువులు తప్ప పాటించనివి, పాటించకపోయినా మిగిలినవాళ్లు పిడుగుల్లా జీవించేస్తున్నారు కనక పాటించనక్కర్లేనివి వున్నాయని అనిపిస్తోంది.

పార్వతి అల్లాంటి విషయాల గురించి ఆలోచించదు. ఆలోచించడానికామె మనస్సు ఒప్పుకోదు. కొన్ని వేల సంవత్సరాలుగా పెద్దలు ఆచరిస్తూ వచ్చి మనని ఆచరించమన్నవి, ఆచరిస్తే పోలా! అనుకొంటుంది. మన పెద్దలు మూర్ఖులు కారుకదా అనుకొంటుంది. వాళ్లు కూడా పెద్ద ఆలోచనలేకుండా ఆచరిస్తేపోలా అన్న క్షేమకరమైన పద్ధతి అవలంభించి మనస్సుకు ఆందోళన కలిగించేలాంటి ఆలోచనలు చేసివుండక పోవచ్చునని అనుకోదు.




పాపం, దీనికి అమ్మా నాన్నాలేరు, మనం పెంచుకుందామా!



టింకూ లాంటి బాబు మీకూ వుంటే
రీగల్ కావలసిందేమరి! ఇండియాలో అత్యధిక శక్తి గల డిటర్జెంట్ బట్టల సబ్బు.

టింకూ లాంటి పిల్లలు ఉంటే బట్టలు ఉతికే పని అధికం. అందుకు 'రీగల్' మాత్రమే సరయిన డిటర్జెంట్ సబ్బు. 'రీగల్'కుగల అధిక తెల్లదనాన్నిచ్చే శక్తి ఎంతటి మురికినైనా తొలగించి, మీ బట్టలను తళతళలాడే తెలుపుతోను, వెలుగుతోను మెరిసేలా చేస్తుంది. లోనికి చొచ్చుకొనిపోయి మురికిని తరిమివేయగల–శక్తివంతమైన–నురుగునిచ్చేది 'రీగల్.' ఇతర డిటర్జెంట్ సబ్బులన్నిటికన్న ఎక్కువ ఉతుకులు ఇచ్చే 'రీగల్,' మీకు ఎంతో పొదుపుచేస్తుంది. 'రీగల్'ను మీ కుటుంబపు డిటర్జెంట్ సబ్బుగా చేసుకోండి.



Rediffusion D/767e/TL/R

''మీమీదెల్లాగైనా వనజ ఇన్‌ఫ్లుయన్సుంది'' అంది.

"ఉందేమో."

''ఆ ఇన్‌ఫ్లుయన్స్ యిలాంటి విషయాలలో ఆగితే నయం. మీరు వేసుకొనే బట్టలమీదకి, మీరు జుట్టు దువ్వుకునే విధానంమీద లేకుండావుంటే పరవాలేదు'' అంది. అందులో వనజ ఆకర్షణలో శంకరరావు పడరాదనే కాంక్ష, వనజ శంకరరావుని ఆకర్షిస్తుందేమో అన్న భయం వున్నాయి. పిల్లలు పుట్టిన ఆడవాళ్లకంటే, తల్లులుకాని స్త్రీలు మగవాళ్ల కళ్లకి ఆకర్షణీయంగా కన్పిస్తారని ముఖ్యంగా లేతపరువంలోని కన్యలైతే మరీ ఆకర్షణీయంగా కనిపిస్తారని చెప్పుకోగా విని, కథలనిండా చదివి నిర్ధారించుకొంది. అందుకని అటువంటివాళ్ల నుంచి శంకరరావుని రక్షించుకోవాలన్న ప్రయత్నం చేస్తూవుంటుంది. ఒకసారి శంకరరావుతో పార్వతీ విషయం గురించి వాదిస్తూవుంటే —

''నీకంటే వయస్సెక్కువఅయిన ఆడవాళ్ళ, ఎక్కువ పిల్లల్ని కన్నవాళ్ళ, నిన్నుకూడా వాళ్ల భర్తలకి చాతైనంత దూరంలో వుంచాలని అనుకోవచ్చుకదా! ఉదాహరణకి రంగస్వామిగారికి నీ థీరీ ప్రకారం నీపట్ల ఆకర్షణ, లక్ష్మిగారికి అనుమానం వుండాలి'' అన్నాడు.

''ఛీ! నాకు ఆయనేం నచ్చడు. పైగా కొందరాడవాళ్ళు మాత్రమే అల్లా వలలు పన్నుతారు. నేనల్లాంటిదానిని కాదు. మీ కళ్లకంత నీచంగా కనిపిస్తున్నానా?'' అంటూ కళ్లనీళ్లు పెట్టుకొని వాదనని ఓ కొలిక్కి తెచ్చింది.

శంకరరావు వనజ విషయమై వాదన పెంచలేదు. "ఇల్లొచ్చింది దిగు'' అంటూ పార్వతిని ఆలోచనలలోంచి లేపాడు.

ఆకర్షణ - వ్యామోహం

వారం గ్రిరున తిరిగి ఆదివారం వచ్చింది. మధ్యాహ్నం రెండుగంటలకు బయల్దేరి హరే రామ హరే కృష్ణ వాళ్ల గుడికి వెళ్లారు. తెల్లగా పిలకలు పెట్టుకొని పంచెలు కట్టుకొని మొగవాళ్ళ, తెల్లగా చీరలు కట్టుకొని ఆడవాళ్ళ కూర్చున్నారు. అందులో హారిని పోల్చుకొన్నారు. అందరి మెడల్లో రుద్రాక్ష మాలలు. అందరిలోను తను అనుసరిస్తున్నది సరియైన మార్గమేనన్న విశ్వాసం కనిపిస్తున్నాయి. తాళాలు వాయిస్తూ, హార్మోనీ వాయిస్తూ ప్రార్థనలు చేసారు. పార్వతి ఆపిల్స్ ఇచ్చింది. వచ్చినవాళ్లందరికి ప్రసాదాలు పంచారు.

''హారీ! నీతో మాట్లాడాలి'' అన్నాడు శంకరరావు.

"నా పేరు హరి. హారీ కాదు. మా అమ్మ పంపిందనుకొంటాను. రండి ఆ మూల కూర్చుని మాట్లాడ్దాము. రాడా (రాధా) ఈ బాబుని కాస్సేపు మైండ్ చేసిపెట్టు'' అంటూ హారీ ఓ పిల్లను పిల్చాడు. ఆ పిల్ల బాబుని తీసుకువెళ్లి తాళాలు వాయిస్తూ పాట పాడటం నేర్పడం మొదలుపెట్టింది.

దూరంగా వెళ్లి కూర్చున్నారు. అదింకా మార్చి నెలే. చలి లేకుండా చాలా ఆహ్లాదకరంగా ఉంది వాతావరణం కాని మనస్సులే బరువుగా ఉన్నాయ్.

''నువ్విలా చెయ్యడం బాగాలేదు హారీ!'' అన్నాడు శంకరరావు.

''ఎల్లా చెయ్యడం? నాకు నచ్చిన మార్గం అవలంబించడమా?''

''నీకు నచ్చిన మార్గంలో నువ్వు వెళ్తే ఎల్లా? అది జోన్‌కి ఎంత బాధ కలిగిస్తోందో తెల్సా? కుటుంబంలో అందరు ఎవరిష్టమైన పనులు వాళ్ళు చేస్తుంటే కుటుంబం సాఫీగా ఎల్లా నడుస్తుంది?'' అని అడిగింది పార్వతి.

''ఇది మళ్ళీ ఇండియన్స్ కాన్‌సెప్ట్. మా దేశంలో మేము అందరం మాకు నచ్చింది తప్ప ఏం చెయ్యం. ఎవరి సుఖం వాళ్ళు చూసుకొంటాం. ఎవరి బాధలు వాళ్లం పడ్తాం. ఎవర్నీ బ్లేమ్ చెయ్యం. మా అమ్మ, మా అమ్మమ్మని వదిలి నాన్నను పెళ్లి చేసుకొని ఇల్లు వదిలిననాడు మా అమ్మమ్మ ఇల్లాగే బాధపడి ఉంటుంది. అది తాత్కాలికం.''

''పెళ్లి చేసుకు ఇల్లు విడిచిపెడ్తే తల్లిదండ్రులకి బాధ కలిగినా పిల్లలు సుఖపడటానికి తమని విడిచి వెళ్తున్నారన్న తృప్తి ఉంటుంది. నువ్వు పెళ్లి చేసుకొని వేరుపడటం జరగలేదు. నువ్వు సన్యసించావు!'' అంది పార్వతి.

''సుఖపడటానికి నిర్వచనం ఏమిటి? నేను పడుతున్నది సుఖం కాదని మీరంతా అనుకోడానికి ఆధారాలేమిటి? నేను సుఖపడటంలేదన్నది మీ అభిప్రాయం'' అన్నాడు హారీ తీవ్రంగా.

''పోన్లే హారీ అది వదిలెయ్యి. నువ్వు మా హిందూమతం వైపు మొగ్గు చూపించడం మాకు గర్వకారణం. కాని మాలో కామి గాక మోక్ష కామి కాలేదు అన్న సూక్తి ఒకటుంది. ధర్మార్థ కామ మోక్షాలు అంటూ మోక్షాన్ని నాలుగో స్థానానికి నెట్టేసారు. పైగా ధర్మవ్యాధుడి కథ నువ్వు చదివే ఉంటావు. నువ్వు సమాజంలో ఆక్రమించిన స్థానంబట్టే అంటే కొడుకుగా తండ్రిగా ఉద్యోగస్థుడిగా కొన్ని బాధ్యతలుంటాయి. అవి సక్రమంగా నెరవేర్చటం ప్రథమ కర్తవ్యం అని మేం నమ్ముతాం'' అన్నాడు శంకరరావు.

''ఇవన్నీ నేను వినలేదు. భక్తుడు పిల్లిపిల్లలాంటివాడని భగవంతుడు పిల్లిలాంటివాడని భక్తుడు భగవంతుని నమ్మితే చాలని విన్నాను'' అన్నాడు హారి సందేహంగా.

''క్రైస్తవుల దేవుడు పిల్లి కాడా? క్రైస్తవులు పిల్లి పిల్లలు కారా? కాకపోయి మీరు గొర్రెపిల్లలు. మీ దేవుడు గొర్రెల కాపరి కదా! నువ్వు హిందువుడవై సాధించినదేమిటి? పరధర్మం ఎంత ఆకర్షణీయంగా ఉన్నా అది స్వధర్మం కాదు అన్నాడో చోట రామకృష్ణ పరమహంస హిందువుల నుద్దేశించి. అది క్రైస్తవుల నుద్దేశించి చెప్పినా నిజమేననుకొంటాను'' అన్నాడు శంకరరావు. శంకరరావు మనస్సు పీకుతోంది. శంకరరావుకి హిందూమతం పట్ల నమ్మకం గౌరవం ఉన్నాయి. కాని ఈ రోజు అతను జోన్ కోరటంవల్ల ఒక మతం మరో మతాన్ని మించి ఏమీ ఎక్కువగా కలిగి ఉండదు అన్న ధోరణిలో మాట్లాడుతున్నాడు.


"ఆలోచిస్తాను. మీరు చెప్పింది నాకు సవ్యంగా ఉందని అనిపిస్తే నేను తిరిగి వస్తాను. నేను హిందుమత ప్రచారకుల ఉపన్యాసాలు విన్నాను కాని హిందూ వేదాంతం చదవలేదు. చదువుతాను. ఆపైన నిర్ణయించుకొంటాను.'' అని మాటిచ్చాడు

[34 వ పేజీ చూడండి]

"ఉడుత సందేశం"

— ఫోటో : ఎస్. శివనారాయణ







సంస్థాపకులు


కొత్తయుగం

సిద్ధులు

కొత్త ప్రభుత్వం ధ్యానం - సిద్ధులు

జనవరి 12, 1975 నాడు కొత్తయుగం ఒకటి మొదలయింది. జనవరి 12, 1976 నాటికి ఒక ప్రపంచ ప్రభుత్వం ఏర్పడింది.

ఈ సమాచారం "వరల్డ్ గవర్నమెంట్ న్యూస్" అనే పత్రిక చదివితే తెలుస్తుంది. ఇది



రాజభవనం

మహర్షి మహేష్‌యోగి కేంద్రస్థానం అయిన సీలిస్‌బర్గ్ (స్విట్జర్లాండ్) నుంచి వస్తుంది. కళ్ళు తిరిగిపోయే ముద్రణ – ఆర్టు కాగితం, రంగులు, బంగారం ...

ప్రపంచంలో ప్రపంచ చైతన్యాన్ని లేవ దీసేందుకే ఈ ప్రభుత్వం ఉనికిలోకి వచ్చిందట.

ఇందులో పది మంత్రి శాఖలు ఉన్నాయి. పదింటికీ పదుగురు ముఖ్యమంత్రులు. (భారత ప్రభుత్వం గమనించాలి.) "చైతన్యాభివృద్ధి; సహజన్యాయం; సాంస్కృతిక సమయిక్యత—ప్రపంచ సమ్మేళనం — అజమత్యం; విద్య — వికాసం; వేడుకలు—సంతృప్తి; సంపద—పురోగమనం; సమాచారం—ఉత్తేజం; అన్ని అవకాశాలు – పరిశోధన—అభివృద్ధి; వికాసయుగం కేంద్రాలు; ఆరోగ్యం — చిరంజీవిగుణం" ఇవి శాఖల పేరులకి తెలుగు అనువాదాలు.

మహర్షి మహేష్‌యోగి పత్రికలో ఎందరో శాస్త్రజ్ఞుల పేరులు, బొమ్మలు కనిపిస్తాయి. అక్టోబరు, 1978 సంచికలో విద్యుచ్ఛక్తి, అయస్కాంతశక్తి, కాంతి, ఆకాశం, కాలం, క్యాంటమ్ థియరీ – వీటికి సంబంధించిన బొమ్మలు కనిపిస్తాయి.

వివిధ దేశాలలో మహేష్ యోగి సంస్థల అభివృద్ధి వార్తలనీ చదువుకోవచ్చు. ఇంగ్లాండ్, స్వీడెన్, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్, జర్మనీ, అమెరికా సంయుక్తరాష్ట్రాలు వగయిరా ...

అంతేకాదు, ప్రపంచ జనాభా 400 కోట్లు అయితే, కనీసం —

– 40 కోట్లమంది మహేష్‌యోగి అతీత ధ్యానం (!) అభ్యాసం చేస్తున్నారుట, ఇంకా కనీసం –

– 4 కోట్లమంది అతీతధ్యానం సిద్ధులు అయ్యారుట.

అమెరికా, యూరోపుల సంగతి సరేగాని చీనాలో 81 లక్షలమంది, రష్యాలో 61.5 లక్షల మంది (కనీసం) అ. ధ్యా. అభ్యసిస్తున్నాడని "వ. గ. న్యూ" పత్రిక వివరిస్తోంది.

సిద్ధులకీ కొదువలేదు. చీనాలో (కనీసం) 81,000 మంది, రష్యాలో 61,500 మంది ఉన్నారుట.

ఈ సిద్ధులలో కొందరికి గాలిలో తేలటం వచ్చుట. దీనిని నిరూపించేందుకు "వ.గ.న్యూ." పత్రిక కొన్ని బొమ్మలు ప్రచురించింది. వాటిని ఇక్కడ చూడవచ్చు. వాళ్ళు తేలుతున్నారా ? లేదా ఎగిరిపడుతున్నారా ? అని కొందరు అడుగుతున్నారు !

[ఎ. వి.]

జి.వి.జి. పేజీ

కరుణామయుడులో దైవకుమారుని గంభీరవాక్కు

మమత స్థానంలో మత్సరం, అనురాగం స్థానంలో ద్వేషం, కరుణ స్థానంలో కార్పణ్యం హింసారాజ్యం చేస్తున్న దాదాపు రెండువేల సంవత్సరాలనాటి మాట ... ఒకవైపు హిరోదురాజు పరిపాలనపట్ల అనాసక్తి — సదా భోగలాలసత్వం, మరోవైపు మతాచార్యులు కైఫాస్ చేసే నిరంకుశత్వం మధ్య యూదులు నానాహింసలకు గురి అవుతున్నారు ... దైవకుమారుడు క్రీస్తు పాదసంచారి అయి, ఊరూరా పర్యటిస్తూ — దైవవాక్కును జనహృదయాలకు వినిపిస్తున్నాడు. హీనులు, దీనులు, దగాపడ్డ తమ్ముళ్లు, కాలుజారిన చెల్లెళ్ళు, నిస్సహాయులను క్రీస్తు ఓదార్చుతూ, క్షమిస్తూ, పశ్చాత్తాపంతో వారిలో పరివర్తన తీసుకువస్తున్నాడు. అతనికి శిష్యులు పెరిగిపోయారు.

మతాచార్యం వద్ద ముప్ఫై నాణాలంచానికి క్రీస్తును పట్టిస్తానని ఒప్పుకున్నాడు యూదా. ఈ విషయం తెలిసిన క్రీస్తు ఆ రాత్రి భగవత్ ప్రార్థనలో లోకపాలకుడ్ని ఇలా అర్థించాడు: ''నీవు నాకు అప్పగించిన పనులు నీ చిత్తప్రకారమే నెరవేర్చాననుకుంటే — ఇకపై నీ చిత్తమే నెరవేర్చు. లేదా — ఈ శోధనల నుంచి నన్ను తప్పించు.''

యూదా తన పథకం ప్రకారం సైన్యంతో వచ్చి క్రీస్తును వాళ్ళకు అప్పగించాడు. క్రీస్తును మతద్రోహిగా, ప్రజాద్రోహిగా తీర్పునిస్తూ కైఫాస్, అతన్ని శిక్షించమంటూ రాజుకు ఫిర్యాదు చేశాడు.

అప్పుడు క్రీస్తు తన శిష్యులతో ''మిమ్మల్ని విడిచివెళ్లే ఘడియలు ఆసన్నమయ్యాయి. మెళకువతో వుండండి...నన్ను నేను అప్పగించుకొని నా రక్తం చిందించనిదే ఈ రక్తమునకు రక్షణ లేదు,'' అన్నాడు.

ప్రధాన పాత్ర నిర్వహిస్తూ, విజయచందర్ నిర్మించే రాధా చిత్ర ''కరుణామయుడు'' వర్ణ చిత్రం డిసెంబర్ విడుదల.



'వజ్రాలవేట'లో ఆరతి

దాసరి రచన, దర్శకత్వంలో తొలి సంపూర్ణహాస్య ప్రధాన చిత్రం

''పెద్దిల్లు — చిన్నిల్లు'' అనే వినోదాత్మక చిత్రాన్ని దాసరి నారాయణరావు కథ, స్క్రీన్‌ప్లే, మాటలు, దర్శకత్వంలో లక్ష్మీనరసింహా పిక్చర్స్ వారు తెరకెక్కిస్తారు. ఇందులో ఒక అపూర్వమైన పాత్రకు రంగస్థలానుభవంగల కొత్తవారిని పరీక్షించడం జరుగుతుంది. సరియైనవారు ఎన్నిక కాని పక్షంలో ఆ పాత్రను దాసరిగారే ధరించే అవకాశం లేకపోలేదు.

దాసరి మరో చిత్రం ''సిరిపురంలో ఓ చిన్నాడు''ను శోభన్‌బాబు, జయసుధ, సుభాషిణి వగైరా నటవర్గంతో యూనిస్ ఎంటర్‌ప్రైసెస్ పతాకంతో రాములు నిర్మిస్తారు. మూలకథ వెంకటేశ్వరరావు. సంగీత దర్శకుడు : చక్రవర్తి. మే 25న షూటింగ్ ప్రారంభమై, జూలైకు పూర్తవుతుంది.

తెలుగుచిత్ర వారి ''నీడ'' దాసరి మరో ప్రతిష్ఠాత్మక చిత్రం. నూతన తారాగణంతో రామినేని నిర్మించే ఈ చిత్రానికి రమేష్‌నాయుడు, కె. ఎస్. మణి, బాలు, భాస్కరరాజు — సంగీతం, ఛాయ, కూర్పు, శిల్ప శాఖలను నిర్వహిస్తారు.

''కోరికలే గుర్రాలయితే, రావణుడే రాముడైతే'' వగైరా దాసరిచిత్రాలు తుది మెరుగులు దిద్దుకుంటున్నాయి.

డైరెక్టర్ బి. ఎస్. నారాయణకు రెండు చిత్రాలు

శారద నాయికగా ఆర్ట్ పిక్చర్స్ నిర్మించే ''నిమజ్జనం'' చిత్రానికి కథ : మంజేరీ ఎస్. ఈశ్వరన్. మాటలు : బొల్లిముంత శివరామకృష్ణ. సంగీతం : ఎం. బి. శ్రీనివాస్. ఛాయ : బాలు మహేంద్ర.


''మీరైతే ఏం చేస్తారు ?'' అనే పలు బహుమతులందుకున్న ఎస్. కాశీవిశ్వనాథ్ నాటికను సునీత అండ్ జమున ఎంటర్‌ప్రైసెస్ పతాకంలో విశాఖపట్నం వాస్తవ్యులు చింతల రాంబాబు, కె. శౌర్యన్‌లు నిర్మిస్తారు.

పాత నిర్మాతల కొత్త చిత్రాలు

నిర్మాత ఎస్. భావనారాయణ చుట్టు వెలిగిస్తూ, "ఈమధ్య మా ఫాక్టరీతో బిజీగా వుండిపోయాను. లాభసాటిగా వుంది. దాన్ని మా అబ్బాయిలకు అప్పగించి, మళ్లీ చిత్ర నిర్మాణానికి ఉపక్రమించాను. ఈమధ్య చాలా ప్లాట్లు ఆలోచించివుంచాను," అంటూ ఒక కథ వినిపించి, "న్యూవేవ్ కథ. నూతన్‌ప్రసాద్ హీరో. డైరెక్టర్‌గా పి. ఎస్. రావ్‌గారిని బుక్ చేశాను. బెంగళూరులో తయారౌతుంది. కన్నడంలో కూడా తీస్తాను. మిగతా వివరాలు వచ్చే వారం తెలియజేస్తాను," అన్నారు.

నవశక్తి పతాకంలో ఎన్. టి. ఆర్., జయసుధలతో పర్వతనేని గంగాధరరావు ప్రారంభించే వర్ణ చిత్రానికి నందమూరి రమేష్ దర్శకుడు. సత్యం సంగీత దర్శకుడు. ఎస్. ఎస్. లాల్ ఛాయాగ్రాహకుడు. జనవరి నించి ఏప్రిల్ వరకు షూటింగ్.





'ఇంటింటి రామాయణం'లో చంద్రమోహన్, జయసుధ

వి. మధుసూదనరావు దర్శకత్వంలో రెండు చిత్రాలు

విజయకుమార్ నిర్మించే శివకామేశ్వరి ప్రొడక్షన్స్ వర్ణచిత్రంలో సత్యనారాయణ ప్రధాన పాత్రధారి. కథ : బాబీ. సంభాషణలు : ఆత్రేయ. సంగీతం : జి. కె. వెంకటేశ్.

"అంగడిబొమ్మ" చిత్రాన్ని సమర్పించిన అట్లూరి హనుమంతరావు మరో విమాత్నమైన కథను అందించబోతున్నారు. గీతా చోప్రాల హత్యాకాండలలాంటి వెలుగులోకి రాని ఉదంతాలెన్నో వున్నాయి. సెంటిమెంట్స్‌తో పాటు కరాటే ఫైట్స్‌కు ప్రాధాన్యతగల ఇలాంటి ఒక కొత్త తరహా కథ మధుసూదనరావు దర్శకత్వంలో తయారవడం ఆయన అభిమానులకు అమితానందకరమైనవార్త కాగలదు.

బిల్లా-రంగాలుగా తెరమీద

ఇటీవల ఢిల్లీలో సంచలనం కలిగించిన బిల్లా – రంగా గాధను హిందీలో ఒకరు తెరకెక్కిస్తున్నారు. బిల్లాగా అమోల్‌పాలేకర్, రంగాగా మిధున్ చక్రవర్తి నటిస్తున్నారు.

జి. వి. జి. పే జీ

తాయారమ్మ - బంగారయ్యలో పట్నం - పల్లెల మధ్య తర్కం

"పట్నం భూలోక స్వర్గమన్నది నీ భ్రమ, అరుణా! అక్కడ పశువులుండకపోవచ్చుగాని మనుషుల్లో పశుత్వం వుంటుంది. ఇరుకు సందులు వుండకపోవచ్చు. ఇరుకైన మనసున్నవాళ్ళుంటారు. పట్నవాసాలు దూరపుకొండలు, అరుణా!" అంది వాణి.

"విలువ తెలీని మనుషులు నీలాగే మాట్లాడుతారులేవే. ఒక్కసారి పట్నం వెళ్ళి తిరిగిరా! మళ్ళీ నువ్వు పల్లెటూరుకేసి చూస్తే ఒట్టు. రకరకాల ఫాషన్లు ... సీతాకోకచిలుకల్లా అలంకరించుకుని తిరిగే మనుషులూ ... ఓహ్!"



'కరుణామయుడు'లో శ్రీధర్, విజయచందర్

"నీకు కావల్సింది అలంకరణ. నేను కోరుకునేది అంతఃకరణ. పట్నం మనుషులు వేసే రంగురంగుల బట్టలే కనిపిస్తాయి నీ కళ్ళకు. ఆ బట్టలు దాచే కుళ్ళు కనిపిస్తుంది నా కళ్ళకు. పట్నపు భేషజాలకంటే — పల్లెటూళ్ళలోని నిరాడంబరతే నా కిష్టమే."

"అంటే, పల్లెటూళ్ళలోని గానుగెద్దు బ్రతుకే మంచిదంటావ్?"

"పట్నాలమోసపు బ్రతుకుకంటే యిదే మంచిది."

"కాదు; పట్నంలో సుఖం వుంది."

"పల్లెటూళ్ళలో తృప్తి వుంది."

"నువ్వు లక్ష చెప్పు. ఐ లైక్ సిటీస్."

"నువ్వేం చెప్పకు. నాకు పల్లెటూళ్ళే ఇష్టం."

జానకి, సత్యనారాయణ ప్రధాన భూమికలు నిర్వహించిన పూర్ణోదయా ఆర్ట్ క్రియేషన్స్ "తాయారమ్మ – బంగారయ్య" వర్ణ చిత్రంలో రంగనాథ్, చంద్రమోహన్, రాజ్‌బాబు, జి. ఎస్. ఆర్. మూర్తి, శరత్‌బాబు, సంగీత, మాధవి, జయ, ఛాయాదేవి పాల్గొన్నారు. జంధ్యాల సంభాషణలను, చక్రవర్తి సంగీతాన్ని, భాస్కరరావు ఛాయను, అంకిరెడ్డి కూర్పును, పృధ్వీరాజ్ నిర్మాణాన్ని నిర్వహించిన ఈ చిత్రాన్ని కొమ్మినేని శేషగిరిరావు దర్శకత్వంలో ఏడిద నాగేశ్వరరావు, బి. యె. ఆకాశం శ్రీరాములు బి. యె. బి. ఎల్. వినోదాత్మకంగా నిర్మించారు.

రామూ కారియత్ తెలుగు చిత్రం

అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిన 'చెమ్మీన్' చిత్ర దర్శకుడు రామూ కారియత్ ఇప్పుడు వై. జె. క్రియేషన్స్ "కొండగాలి" చిత్రానికి దర్శకత్వం నెఱపుతున్నారు. నయనానందకరమైన ప్రకృతి సౌందర్యంగల శ్రీకాకుళం ఏజెన్సీ ప్రాంతంలో ఈ చిత్రం టాడ్ ఏ ఓ – స్కోప్‌లో తయారౌతోంది

రామూ కారియత్ తన 22 సంవత్సరాల సినీ జీవితంలో తన మాతృభాష అయిన మలయాళంలో మాత్రమే ఇంతవరకు పదిచిత్రాలే తీశారు. ఈ చిత్రాలన్నీ వివిధ అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలలో ప్రదర్శింపబడ్డాయి మొత్తం 16 బహుమతులు సంపాదించాయి. "చెమ్మీన్" చిత్రం ద్వారా దక్షిణ భారతం కేంద్రప్రభుత్వం నుండి తొలి స్వర్ణ పతకాన్ని పొందింది. హిందీలో చిత్రాలు తీసిపెట్టమని లోగడ ఆయనకు ఎన్నోసార్లు అవకాశాలొచ్చినా అంగీకరించలేదు. "ఎందుకంటే నేటివిటీ చూపలేము ఆ చిత్రాల్లో. తెలుగుజాతి, తెలుగు నాగరికత, తెలుగు సంస్కృతి అంటే నాకెంతో గౌరవం, అభిమానం. మా విస్నతసంలో కేరళలో మేంచూసిన తొలి సినిమాలు 'మాలపిల్ల, రైతుబిడ్డ, పాతాళభైరవి, మాయాబజార్.' ఆ రోజుల్లో డబ్బింగ్‌లుకూడా లేవు. 'మాలపిల్ల' ని మేం అలాగే చూసి ఆనందించేవాళ్ళం. తెలుగు చిత్రాల స్వర్ణయుగం ఆ చిత్రాలతోముగిసిపోయింది. ఈనాటి తెలుగు సినిమాల్లో సమాజం లేదు. వ్యక్తులు లేరు. కథ లేదు. ఉన్న కథలకు జీవం లేదు. ఇందుకు నేనెంతో బాధపడుతున్నాను. సమాజానికి సేవచెయ్యలేని సినిమా సినిమాకాదు. సినిమా కేవలం వినోదానికి, ధనార్జనకు సాధనంకాదు. ఈ నమ్మకంతోనే ఈ తెలుగుచిత్రం తలపెట్టాను," అన్నారు రామూ కారియత్.

వై. జె. రెడ్డి సరికొత్త తారాగణంతో నిర్మించే "కొండగాలి" చిత్రానికి విజయరత్నం సంభాషణలు, శ్రీ శ్రీ గీతాలు, సలీల్‌చౌదరి సంగీతం, అశోక్‌కుమార్ ఛాయ ఇతర అలంకారాలు.

కె. రాఘవేంద్రరావు దర్శకత్వంలో గోపీకృష్ణా మూవీస్ చిత్రం

కృష్ణంరాజు సమర్పణలో ఆయన, జయసుధ, సత్యనారాయణ, ప్రభాకరరెడ్డి, అల్లురామలింగయ్య ప్రభృతులు పాల్గొనే వర్ణ చిత్రాన్ని యు. వి. సూర్యనారాయణరాజు భారీఎత్తున నిర్మిస్తారు. జంధ్యాల సంభాషణలకర్త. సత్యం సంగీత దర్శకుడు. వి. ఎస్. ఆర్. స్వామి ఛాయాగ్రాహకుడు.


ఇది విన్నారా?

★ "మనవూరి పాండవులు" చిత్రంలో పిచ్చిదానిగా నటించిన కుమారి శోభ, ఇంట్లో మాడరన్ దుస్తులనే ధరిస్తుందట. ఇంకొక విడ్డూరం ఏమిటంటే "స్టార్ డస్ట్, సూపర్" మున్నగు హిందీ పత్రికల్లో ప్రచురింపబడిన తారల వివిధ భంగిమల ఫోటోలను తన రూమ్‌లో ఓ ఆల్బమ్‌లా అంటించిపెట్టిందట. సినిమాకి, జీవితానికి ఎంత తేడా!

★ హిందీ తార సాధనకు ప్రస్తుతం సినిమాలు లేవట పాపం. మస్తుగా త్రాగడం అలవాటు చేసుకుందట. గడచిన జీవితాన్ని మర్చిపోవడానికి కామోసు! మరి మన తారలు చిత్రాలు లేకపోతే ఏం చేస్తుంటారో! లోగుట్టు పెరుమాళ్ళ కెరుక

★ ప్రముఖ నిర్మాత శ్రీ చిన్నప్పదేవర్ జంటగావున్న మురగదేవుడ్ని కొల్చేవారు కాదట. ఎందుకని అడిగితే ఆపత్సమయంలో పిలిస్తే రావడానికి కాస్త తమాయించవచ్చు. అందుకని తను ఎప్పుడూ సోలో మురుగదేవుడ్నే కొల్చేవారట.

★ నటి శ్రీప్రియ తమిళంలో నిర్మిస్తున్న "నీయా" చిత్రంలో నటిస్తున్న నటీనటులు (ఎక్కువమంది) రోజు కింత అని రేటు మాట్లాడుకుని నటిస్తున్నారట. అంటే రోజు కూలీ అన్నమాటగా. మన రంగంలో కూడా మన తారలు ఎందుకలా చేయకూడదు? శ్రీనివాస్



సీడెడ్: నవభారత్ ఫిలింస్ నైజాం: శ్రీతారకరామఫిలింస్ కర్నాటక: యస్.వై.కె.కంబైన్స్.

సినిమా



కే. డి. నెంబర్ 1లో జయసుధ, రామారావు

మోహన్‌బాబు భార్య విద్యావతి !

నేటి మేటి విలన్ మోహన్‌బాబు చాలామందికి తెలియని ఓ నిజాన్ని బయటపెట్టారు. "నా కన్నా నాభార్య బాగా చదువుకుంది. నా భార్యపేరు విద్యావతి. పేరు తగ్గట్టుగానే విద్యావంతురాలు. యం. ఏ. చదివింది. ఆమె చదువుతో పోల్చుకుంటే నా చదువు చాలా స్వల్పం. అలాంటి విద్యావతి నా సతి అయిందని కొన్నిసార్లు అనుకుంటుంటే నాకే ఆశ్చర్యంగా వుంటుంది. ఐ యామ్ ఏ లక్కీమాన్ రియల్లీ" అన్నాడు మోహన్‌బాబు.

జయకుమారి వాదం సమంజసమైనదే!

జయకుమారి అనే ఈ పేరు మీకందరికీ చిరపరిచితమే. లోగడ ఎన్నో తెలుగు చిత్రాల్లో నృత్యాలు చేసింది జయకుమారి. విధి ఆడిన వింత నాటకంవల్ల కొంతకాలం పరిశ్రమకు కనుమరుగైంది జయకుమారి. జయకుమారికి పెళ్ళైంది. ప్రస్తుతం తమిళ చిత్రాల్లో నటిస్తూంది. "54 ఏండ్లు అయినా, ఇంకా చిత్రాల్లో నటిస్తూ, నాట్యం చేస్తూంది హెలెన్. ఆమె నడిగేవాళ్ళు ఎవర్లూలేరు. అలా అడిగినా ఆమె వినాలిగా ? నాకు పెండ్లి అయిపోయింది కనుక నేను ఇక నాట్యం చేయడానికి పనికిరాను అని నిర్ధారణ చేసేయడం న్యాయమా ? నిజానికి పెండ్లి అయ్యాకనే కొన్ని కొత్త అందాలు వస్తాయి. అలాంటపుడు చిత్రాల్లో నటిస్తే తప్పేముంది" అంటుంది జయకుమారి. క్లబ్ డాన్సులు చేయడం కొందరనుకునేట్టు అంత సులభంకాదు. డాన్స్ చేసేపుడు ఒకవైపు ఫీట్ మూమెంట్ చూసుకోవాలి. మరోవైపు లిప్ మూవ్‌మెంట్ చూసుకోవాలి. ఈ రెండింటిని అనుసరిస్తూ కెమెరాను చూడాలి. ఆ దిక్కు, ఈదిక్కు చూడడానికి అవకాశం వుండదు. ఏ మాత్రం అజాగ్రత్తగావున్నా బాడ్ రిజల్ట్ వస్తుంది. చక్కటి పాత్రలను పోషించాలని నాకూ అభిలాషవుంది. కానీ ఇచ్చేవాళ్ళుండొద్దూ ? ఇటీవల బాలచందర్‌గార్ని కలిసినపుడు త్వరలో నీకొక చక్కటి క్యారెక్టర్ ఇస్తాను అని చెప్పారు" అంది ఎంతో ఆత్మవిశ్వాసంతో జయకుమారి.

జయకుమారి వాదం సమంజసమైనదే. పెండ్లి అయితే నటించకూడదనే సిద్ధాంతంలేదు ఎక్కడా. కానీ నటించడానికి ఎవరైనా ముందుకొచ్చినా, అవకాశం ఇవ్వరు ఇక్కడ. అదొక్కటే ఇబ్బంది.

'ఇద్దరూ అసాధ్యులే'లో కృష్ణ



వాణిశ్రీని ప్రేమిస్తున్న అభిమాని


ఇటీవల కుమారి వాణిశ్రీ అవుట్‌డోర్ షూటింగ్‌లో పాల్గొనడానికి వెళ్ళినపుడు అక్కడికొక అభిమాని వచ్చాడట. వచ్చిందగ్గర్నుంచి వాణిశ్రీని అమితంగా పొగుడుతూ, మీరంటే నాకు చెప్పలేనంత అభిమానం. మీరూపం మరువలేనిది. మీ నటన అపూర్వం అంటూ మాట్లాడడం ప్రారంభించాడట. అతని అభిమానానికి కృతజ్ఞతలు చెప్పి, షూటింగ్‌లో నిమగ్నమవడానికి తయారైన వాణిశ్రీ రెండుకాళ్లను పట్టుకుని, నేను మిమ్మల్ని ప్రేమిస్తున్నాను, మిమ్మల్నే పెండ్లి చేసుకుంటాను అంటూ మొండికేసాడట. అతన్ని ఎలావిడిపించాలో అర్థంగాక, అయోమయస్థితిలో పడిందట వాణిశ్రీ. ఇంతలో ఆ అబ్బాయి అయినవాళ్ళు అక్కడికొచ్చి "జరిగిందానికి మన్నించండి. వాడికి మీరంటే పిచ్చభిమానం. మీ సినిమాను కనీసం పదిసార్లు చూస్తాడు. మిమ్మల్ని నేరుగా చూచేసరికి మురిసిపోయాడు" అని చెప్పి ఆ వ్యక్తిని తీసుకెళ్లారట.

మిసెస్ చక్రవర్తి కథకు వెండి తెర రూపం

సంగీతదర్శకుడు చక్రవర్తిగారి భార్య శ్రీమతి రోహిణి చక్రవర్తి ఓ కథను వ్రాసిందట. ఆ కథ దర్శకుడు కోటారెడ్డికి నచ్చిందట. ఆ కథను గూర్చి "ఇంద్రధనుస్సు" నిర్మాతల్లో ఒకరైన నన్నపనేని సుధాకర్‌తో చెప్పారట. వారికి కూడా ఆ కథ నచ్చిందట. వెంటనే ఆ కథను వెండితెర రూపం ఇవ్వడానికి నిర్ణయించుకున్నారట కోటారెడ్డి, నన్నపనేని సుధాకర్. ఆ కథకు 'సీతపుట్టింది రాముడికోసమే' అని పేరు పెట్టారు. నవంబర్ మొదటివారంలో ప్రారంభమైన ఈ చిత్రం షూటింగ్ డిశంబర్ మొదటివారానికి పూర్తి అవుతుందని ఉదయలక్ష్మి ఎంటర్‌ప్రైజస్ అధినేతలు నన్నపనేని సుధాకర్, కె. శంకరరెడ్డి చెప్పారు మురళీమోహన్, ప్రభ, ఈ చిత్రంలో ముఖ్యజంట. కోటారెడ్డి ఈ కొత్తచిత్రం ఎలా వుంటుందో చూడాలి మరి !

రమేష్ కొచ్చిన కొత్త ఆఫర్

కర్ణపేయమైన సంగీతాన్ని ఇవ్వగల కెపాసిటీ వున్న సంగీత దర్శకుల్లో రమేష్ నాయుడు ఒకరు. "శివరంజని" చిత్రంలో "జోరుమీదున్నావు తుమ్మెదా" అనేపాటకు, "శివరంజని" అనే పాటకు వారు కూర్చిన బాణీలు ఎంత శ్రావ్యంగా వున్నాయో వేరే చెప్పక్కఱలేదు. వయోలిన్‌తో చక్కటి హమ్మింగ్‌ను సృష్టించగల దిట్ట రమేష్ నాయుడు అని వారి పాత చిత్రాలు చెప్పకనే చెబుతాయి. హిందీ రంగంలో కొన్నాళ్ళు వుండి, ఈ రంగంలో ప్రసిద్ధుడైన రమేష్‌నాయుడికి మళ్లీ ఆ రంగంనుండి పిలుపొచ్చింది. అమితాబచన్ ముఖ్యపాత్రను పోషిస్తున్న ఆ హిందీచిత్రం అతిత్వరల్లో సెట్స్‌కువెళ్లే సూచనలు కన్పిస్తున్నాయి.


ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వంచే
1977 సంవత్సరమునకు
ఉత్తమ నటునిగా ఎన్నికయిన
కృష్ణంరాజు నటించిన....
తమ్మారంగారెడ్డి
సమర్పించు...
భారతి ఆర్ట్ క్రియేషన్స్...
రాముడు రంగడు
కలర్
స్క్రీన్‌ప్లే-దర్శకత్వం:
పి.చంద్రశేఖరరెడ్డి B.A.,
నిర్మాత:
టి.రఘునాథరెడ్డి
Bachi
THARAKARAMA
తారకరామ

సినిమా



'ఎంకి–నాయుడుబావ'లో జయమాలిని, రాజబాబు

సరిత సంగతేమిటి ?

బాలచందర్‌గారి ''మరోచరిత్ర'' చిత్రంలో హీరోయిన్‌గా నటించిన కుమారిసరితకు ఆతర్వాత తెలుగు చిత్రాలు వచ్చినట్టుగా తెలియడంలేదు. సరితకు గ్లామర్ లేకపోవచ్చుగానీ, చక్కటి నటనా కౌశలం వుంది. అందుకే తొలి చిత్రంలోనే ప్రేక్షకుల ప్రశంసలందుకుంది. కథాబలంవున్న పాత్రలకు సరితను ఎన్నుకుంటే సగటు రిజల్టును రాబట్టుకోవచ్చు. సరిత అసలుపేరు అభిలాష. రైటర్ గణేష్‌పాత్రో ''మరోచరిత్ర'' చిత్రం తీస్తున్న సమయంలో సరితనుగూర్చి బాలచందర్ గారిదగ్గర ప్రస్తావించడం, వెంటనే ఆ అమ్మాయిని పిలిపించి బాలచందర్‌గారు చూడడం, వెంటనే ఆ చిత్రంలో కథానాయిక వేషానికి ఎన్నుకోవడం, అన్నీ నిమిషాల మీద జరిగిపోయాయి. సరిత తండ్రిగారు సినీ పరిశ్రమలో ప్రముఖవ్యక్తి. సంగీతదర్శకుడు శ్రీ టి. చలపతిరావు సరితకు చుట్టం. శ్రీ బాలచందర్ తమిళంలో తీసిన ''తప్పుతాళంగల్'' చిత్రంలో హీరోయిన్‌గా నటించి, తమిళ ప్రజల ఆశీస్సులు కూడా అందుకుంది సరిత. సరితను పెట్టి, ఏ నిర్మాత చిత్రం తీయడానికి వెంచర్ చేసినా, అది వ్యర్థంకాదు.

ఆల్బం చెప్పిన నిజం

సత్యం ఎంటర్‌ప్రైజస్ వారి స్కోప్ కలర్ చిత్రం ''కలియుగ మహాభారతం'' ఆల్బమ్ చూచాను యిటీవల వారి ఆఫీస్‌లో. పాత్రల్ని, పాత్ర స్వభావాల్ని, సన్నివేశాల్ని చాలా నమ్మకంతో, పటిష్ఠంగా, పరిపక్వంగా సృష్టించారనిపించింది దర్శకుడు హనుమాన్‌ప్రసాద్ స్టిల్స్ చూస్తుంటే. మహాభారతాన్ని, అందులోని పాత్రల్ని దృష్టిలో పెట్టుకుని, ప్రతి పాత్రను చక్కగా మలచారు తమ వ్యంగ్య భారతంలో కథకుడు పరుచూరి. ''కలియుగ మహాభారతం'' చిత్రంలోని ప్రతి పాత్రకు ఒక కథ వుంది. ప్రతి సన్నివేశానికి బలమైన కారణం వుంది అన్నారు డైరెక్టర్ హనుమాన్‌ప్రసాద్. బిజినెస్‌కూడా ఎంకరేజింగానే వుంది. కాకతాళీయంగా ''రాముడు – రంగడు'' చిత్రం ప్రొజెక్షన్ చూడడానికి వచ్చిన ఒక పార్టీ మా చిత్రంలోని పాటలు చూచి, మా జిల్లాకు మీ చిత్రాన్ని కొనుక్కుంటామండీ! అని అడిగారు. కొంత పాచ్‌వర్క్ మాత్రం మిగిలుంది. త్వరలోనే ఫుల్ పిక్చర్ చూపిస్తాను అన్నాను నేను అన్నారు హనుమాన్‌ప్రసాద్.

''అనాదినుంచి వస్తున్న ఆచారం, ప్రచారం ఒక్కటే. స్త్రీ లేక రాజ్యదాహంవల్ల దేశాలు నాశనమవుతుంటాయి. త్రేతాయుగం నుంచి ఈనాటి కలియుగం వరకూ జరుగుతున్న సంఘటనలను పరిశీలిస్తే ఆ ప్రచారం నిజమే అన్పిస్తుంది. కానీ ఈ యుగంలో ఒక్కటే డిఫరెన్సు. ఆ కాలంలో రాజు ఎంత చెబితే అంత. ఈకాలంలో అందరికీ వాక్‌స్వాతంత్ర్యం వుంది. ఓటు స్వాతంత్ర్యం వుంది. అది వుండికూడా ఏమిటీ వైపరీత్యం, ఏమిటీ భీభత్సం అనే అంశాలను గూర్చి కూడా మా చిత్రంలో కొంతవరకు చర్చించాము'' అన్నారు హనుమాన్ ప్రసాద్.

ప్రసాద్‌బాబుకు మంచి రోజులు

గుండ్రటి ముఖానికి తగిన ముక్కు వుండి వుంటే, గీతా ప్రసాద్‌బాబు ఏనాడో హీరోగా రాజ్యం ఏలేవాడు. రఫ్ కారెక్టర్స్‌కు ప్రసాద్‌బాబు బాగా నప్పుతాడు, మెప్పిస్తాడుకూడా. బాపుగారి ''మన వూరి పాండవులు'' చిత్రంలో రెబల్‌స్టార్ కృష్ణంరాజుగారి తర్వాత ఎక్కువ మార్కులు స్కోర్ చేసింది ప్రసాద్‌బాబే అని నిరభ్యంతరంగా చెప్పొచ్చు. విలన్ పాత్రలకు ఆక్షేపణ లేకుండా ప్రసాద్‌బాబును బుక్ చేసుకోవచ్చు. ప్రసాద్‌బాబు సినీ జీవితంలో హోప్ యుగం ప్రారంభమైందిక.

రాజకీయాలనుంచి లతకి విముక్తి !

''నౌ ఐ యామ్ ఎ ఫ్రీ బర్డ్'' అంటూంది గ్లామర్ తార లత. అంటే నిన్నటివరకు నిర్బంధమా ? అనడిగితే ''అలాంటిదేం లేదుగానీ, మొన్న మొన్నటివరకు నేను ఆల్ ఇండియా అన్నా డి. ఎం. కె. పార్టీలో సభ్యురాలిని. నేను ''వరువాన్ వడివేలన్'' అనే భక్తిరస తమిళ చిత్రంలో భక్తిరస పాత్రను పోషించడం ఆ పార్టీలో కొందరికి నచ్చలేదు. నటి అన్న తర్వాత విభిన్న పాత్రలను పోషించక తప్పుతుందా ? అయినప్పటికీ పార్టీ సభ్యులకు కష్టం కలిగించడం ఇష్టంలేని నేను నా సమస్యను పరిష్కరించమని శ్రీ యం. జి. ఆర్. గార్ని కోరడం జరిగింది. పరిస్థితులను అర్థం చేసుకోగలిగిన సంస్కారం వున్నవారు నన్ను పార్టీ నుండి విడుదల చేసారు. సో, నౌ ఐయామ్ ఏ ఫ్రీ బర్డ్. ఎగతాళికి, ఎత్తిపొడుపుకు ఇక అవకాశం వుండదుగా'' అంది లత.



'కోరికలే గుర్రాలైతే'లో రమాప్రభ, మోహన్‌బాబు

విశేష వార్తలు

★ నవశక్తి గంగాధరరావుగారు జనవరి నుంచి నిర్మించే భారీ వర్ణ చిత్రానికి శ్రీ నందమూరి రామారావు కథానాయకుడైతే, నందమూరి రమేష్ దర్శకుడు. నాయిక జయసుధ.

★ జగపతి ఆర్ట్ పిక్చర్స్ భారీయెత్తున శ్రీ అక్కినేనితో జనవరి నుంచి ప్రారంభిస్తున్న వర్ణ చిత్రానికి, (ఆ సంస్థ చిత్రానికి) తొలిసారిగా కెమెరా సారథ్యం వహిస్తున్నారు కెమెరామెన్ సెల్వరాజ్. ఈ చిత్రంలో కూడా జయసుధే హీరోయిన్.

★ ''చెమ్మీన్'' (మళయాళం) చిత్ర దర్శకుడు శ్రీ రాముకరియత్ దర్శకత్వంలో వై. జె. క్రియేషన్స్ పతాకంపై శ్రీ వై. జె. రెడ్డి ''కొండగాలి'' అనే సంచలనాత్మక చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

★ శ్రీ శ్రీధర్ దర్శకత్వంలో శ్రీ సంజయ్ చిత్ర నిర్మిస్తున్న తొలి చిత్రంలో చంద్రమోహన్, శ్రీదేవి ముఖ్య జంటగా బుక్ అయ్యారు.

★ ''ఊరుమ్మడి బతుకులు'' లాంటి ఆర్ట్ ఫిలిమ్‌ను తీసి, అవార్డు నందుకున్న శ్రీ బి. యస్. నారాయణ ''నిమజ్జనం'' అనే మరో ఆర్ట్ ఫిలిమ్‌ను డైరెక్ట్ చేస్తున్నట్టు వార్త. ఈ చిత్రంలో శారద నాయిక.

"హత్యారా"కు తెలుగు రూపం

వినోద్‌ఖన్నా, ప్రాణ్ నటించిన ''హత్యారా'' చిత్రాన్ని తెలుగులో నిర్మించే ప్రయత్నాన్ని నిర్మాణ నిర్వహణలో నిష్ణాతుడు అన్పించుకున్న యస్. పి. వెంకన్నబాబు తలపెట్టినట్టు, కృష్ణ, సత్యనారాయణగార్లు ముఖ్య పాత్రలు పోషిస్తున్నట్టు ఆ చిత్ర దర్శకుడు యస్. పి. రాజారావు తెలియ చేసారు. ''హీరోగారు మార్చి నుంచి కాల్‌షీట్లు ఇస్తానన్నారు. హీరోయిన్ ఇంకా డిసైడ్ కాలేదు'' అన్నారు వెంకన్నబాబు. నిర్మాణ నిర్వహణలో వెంకన్నబాబు నిష్ణాతుడైతే, దర్శకత్వంలో అనుభవజ్ఞుడు రాజారావు. కనుక చిత్ర నిర్మాణాని కతిముఖ్యమైన ఈ రెండు శాఖల కలయికతో వెలువడే చిత్రం వెరైటీగా వుంటుందని వేరే చెప్పనవసరంలేదు.

– శ్రీనివాస్


ఏవిధంగా చూసినా...
శ్రేష్ఠమైన డిటర్జెంట్.
సరసమైన ధర.
అదే ధరకు
1000 గ్రాం పాకెట్లపై
కట్-ఔట్ బొమ్మలు
Point
Net Weight 1000 gms
for sparkling white and brilliant colour washes
Cricket
Point
...డిటర్జెంట్ పౌడరులలో అత్యంత లాభదాయకం
క్రికెట్ కామెంటరీ దర్శిని + ఆట
వింటూనే ఆటను ''చూడటానికి'' సహాయపడుతుంది.
వివరాలకోసం మీ డీలర్‌ను సంప్రతించండి.
పాయింట్
MCA-PDP 60 Tel

హైద్రాబాద్ సినిమా

హేమా హేమీలకు డా॥ చెన్నారెడ్డిచే ప్రారంభోత్సవం



వర్ధమాన 'భావన'

శ్రీ విజయకృష్ణా మూవీస్ 'హేమాహేమీలు' అనే చిత్రం తీస్తున్నారు. ఇందులో ప్రధాన పాత్రధారులు మన సినీ నటులలో హేమాహేమీలైన నాగేశ్వరరావు, కృష్ణ. వీరిరువురూ కలిసి ఒక చిత్రంలో నటించి బహుకాలం అయింది. ఆరీత్యా యిప్పుడు ఈ కలయిక ఒక విశేషం. ఇది విజయ నిర్మల, కృష్ణల స్వంత కంపెనీ చిత్రం. విజయ నిర్మల డైరెక్టు చేస్తున్నారు. ఆ కంపెనీ చిత్రంలో, ఆమె దర్శకత్వాన నాగేశ్వరరావు నటించటం ఇదే మొదటిసారి.

ఈ చిత్రం షూటింగు నవంబరు 2 ఉదయం అన్నపూర్ణా స్టూడియోస్ 3వ ఫ్లోరులో ప్రారంభం అయింది. కృష్ణ ప్రభృతులు లక్ష్మి, వెంకటేశ్వర, వినాయక, సరస్వతి పటాలకు పూజ చేశాక ముఖ్యమంత్రి శ్రీ చెన్నారెడ్డి కామెరా స్విచ్ ఆన్ చేశారు. శ్రీ ఫిలింస్ అధిపతి శ్రీ పర్వతనేని చంద్రశేఖరరావు తొలి క్లాప్ కొట్టారు. తొలి దృశ్యం నాగేశ్వరరావు, కృష్ణలపై తీశారు. అదొక అతి ధనికుల ఆధునిక భవనంలో పెద్ద హాలు. తెల్లపాంటు, ఎర్రకోటు, నల్ల గుత్తి పైన వేసుకుని, ఎదుటవున్న టీపాయిపై కాళ్లు పెట్టుకుని సోఫాలో కూచున్నారు నాగేశ్వరరావు ఆ రాత్రి. ఒక గాజుపెట్టెలో పదిలపరిచిన కిరీటం చేతపుచ్చుకుని దభాలున తలుపులు తెరుచుకుని లోన ప్రవేశించి లైట్లు వేస్తారు నల్ల సూటు, ఎర్ర గుత్తి పైన వేసుకున్న కృష్ణ. 'ఊ నాకు తెలుసు నువ్వు కిరీటంతో ఇక్కడికి వస్తావని;' అంటారు నాగేశ్వరరావు. 'నాకూ తెలుసు ఈ కిరీటం కోసం నువ్వు నన్ను నీడలా వెంటాడుతావని,' అంటారు కృష్ణ. అదీ ఆ దృశ్యం.

ప్రధాన స్త్రీ పాత్రలను విజయనిర్మల, జరీనావాహాబ్ ధరించే ఈ చిత్రంలో మిగతా నటీనటులు — కృష్ణకుమారి, పండరీబాయి, జయమాలిని, హెలెన్; గుమ్మడి, సత్యనారాయణ, మిక్కిలినేని, గిరిబాబు, పి. జె. శర్మ, త్యాగరాజు, రామలింగయ్య, రమాప్రభ, పద్మనాభం అతిథి నటులుగా అగుపిస్తారు.

కథ, మాటలు — మహారథి, పాటలు—ఆత్రేయ, సి. నారాయణరెడ్డి, వేటూరి, సంగీతం — రమేష్ నాయుడు, ఛాయాగ్రహణం—పుష్పాల గోపీకృష్ణ, కళ — కొండపనేని రామలింగేశ్వరరావు, కూర్పు— ఆదుర్తి హరనాథ్. నిర్మాత — ఎస్. రఘునాథ్, సహనిర్మాత — ఎస్. రమానంద్, నిర్మాణ నిర్వాహకుడు — ఎస్. రవికుమార్.

పత్రికాగోష్ఠి విశేషాలు

ఈ హేమాహేమీల ఇరువురి కలయికతో చిత్ర నిర్మాణం ఒక విశేషమేనని వారే భావించినందువల్ల కాబోలు కృష్ణ, విజయనిర్మల అక్టోబరు 9న ఇక్కడ ఒక పత్రికా గోష్ఠి జరిపి ఈ సంగతి వెల్లడించారు.

ఆ గోష్ఠిలో తారా దర్శక దంపతులు తెలిపింది :

నాగేశ్వరరావుగారితో చిత్రం తీయాలని చాలాకాలంగా అనుకుంటున్నా . ఈనాటికి వారికి తగిన పాత్ర గల కథ దొరకటం, దానిని ధరించటానికి వారు అంగీకరించటం తటస్థించాయి. మా చిత్రంలో, విజయనిర్మల దర్శకత్వంలో నాగేశ్వరరావుగారు నటించడం ఇదే ప్రథమం.

"స్పర్ధ లేదు"

తమకూ కృష్ణకూ 'స్పర్ధ' ఎన్నడూ లేదనీ, పదేళ్ల నుంచి వారు అడుగుతూవున్నా తగిన పాత్ర వుండటంవల్ల ఇప్పుడు అంగీకరించామనీ నాగేశ్వరరావు అన్నారు.

మన ఫిలిం పరిశ్రమకు మూలస్తంభాలుగా ఎంచబడుతున్న నటులలో యిద్దరు ఈవిధంగా సన్నిహితం కానటం రాష్ట్రంలో పరిశ్రమాభివృద్ధికి శుభోదయంగా భావించవచ్చునంటారా అని ఒక పాత్రికేయుడు అడిగారు. అంతంత పెద్ద పెద్ద మాటలు అనవసరమనీ, కృష్ణగారి 'దేవుడు చేసిన మనుషులు'లో రామారావుగారు నటించలేదా అని అక్కినేని అన్నారు

భావన పుట్టినరోజు

వర్ధిష్ణు సినీ నటి భావన అక్టోబరు 27న పుట్టినరోజు పండగ జరుపుకున్నది. అభిమానులనూ పత్రికలవారినీ ఆహ్వానించి అల్పాహారవిందు చేసింది. ఆంధ్ర పంచాంగం ప్రకారం తన పుట్టినరోజు విజయదశమి అనీ, ఆ పండగలో ఈ పండగ కలిసిపోవడం ఇష్టంలేక ఇంగ్లీషు తేదీ ప్రకారం చేసుకుంటున్నాననీ భావన నవ్వుతూ చెప్పింది. 'కోయిలమ్మ కూసింది'లో మొదట నటించినా, 'మంచి మనసు'లో ముందు మన ముందుకు వచ్చిన భావన ఇప్పుడు 'బంగారుబాట', 'అగ్నిసంస్కారం' చిత్రాలలో ప్రధాన పాత్రలు నిర్వహిస్తున్నది. ఇంతకుముందే తెరపై ఎదుగురి దృష్టిని ఆకర్షించిన "పల్లవి" ఈ అమ్మాయికి అక్క అన్నది తెలిసిన సంగతే అనుకుంటాను. ఇట్లా అక్కాచెల్లెళ్లు సినితారలు కావటం తెలుగు ఫిలిం రంగంలో కొత్త కాదు. ఆదిలో శ్రీరంజని, వెంకటలక్ష్మి (జూనియర్ శ్రీరంజని) వుండేవారు. తర్వాత పుష్పవల్లి — సూర్యప్రభ, జానకి— కృష్ణకుమారి వచ్చారు. ఇప్పుడు ఈ ఇద్దరూ.

— ఎం. ఎస్. శర్మ

హారి. శంకరరావు, పార్వతి రాధ దగ్గర పిల్లాడ్ని తీసుకొని ఇంటికి వచ్చారు.


ఆ రాత్రి శంకరరావు చాలాసేపు ఆలోచించాడు. తను హారి కైతే కబుర్లు చెప్పాడు గాని తను ఈ విషయం గురించి ఎప్పుడూ ఆలోచించ లేదు. అన్ని మతాలు మనుష్యులు సత్ప్రవర్తన కలిగి ఉండాలని చెప్తాయి. ఒక కోడ్ ఆఫ్ ప్రాక్టీస్‌ని ఇస్తాయి. అది పాటించనివాళ్లు నరకానికి పోతారని

ఆకర్షణ - వ్యామోహం

[24వ పేజీ తరువాయి]

పాటించేవాళ్లు స్వర్గానికి లేక దైవసన్నిధి చేరుకొంటారని అంటారు. అయితే దేవుడిని నమ్మకుండా సత్ప్రవర్తన కలిగినవాళ్లు ఎక్కడికి పోతారు? దేవుడిని నమ్ముతూ వెధవ పన్లు చేసేవాళ్లు ఎక్కడికి పోతారు? ఏది ముఖ్యం దేవుడిని నమ్మటమా? మంచి ప్రవర్తన కలిగి ఉండటమా? దేవుడు లేడనుకొనేవాళ్లకి ఆ నిర్ణయం తీసుకోడానికిగాను ఎంతో ధైర్యం కావాలి కదా! అదెక్కడనుంచి వచ్చింది! దేవుడు లేడని అనుకొంటే మనుష్యుల ప్రవర్తన మంచిగా ఉండాల్సిన అవసరం ఏమిటి? వివాహ వ్యవస్థలో పవిత్రత ఏమిటి?

[ఇంకా వుంది]


వివా
రోజంతటికీ కావలసిన
చేవను పెంపొందిస్తుంది.
రాత్రిపూట సుఖంగా
నిద్రపుచ్చి ప్రొద్దున్నే
చేవతో తాజాగా
వుండేలా తయారు
చేస్తుంది.
వివా, రోజంతటికీ కావలసిన చేవను పెంపొందిస్తుంది !
వివాలోని ఆధునికమైన మాత్రీకరణ మూలంగా, దీనిలో శక్తినిచ్చే మాల్ట్, ధాతువును (టిష్యూ) పెంపొందించే ప్రోటీన్లు వున్నాయి. ఇవి పనికీ, ఆటకీ కావలసిన శక్తిని పెంపొందిస్తాయి.
వివా, ఖర్చయిన మీ శక్తిని భర్తీ చేస్తుంది రాత్రిపూట !
పడుకోబోయేముందు, రుచికరమైన వేడి వివా ఒకకప్పు తీసుకుంటే, అది మీకు విశ్రాంతినిచ్చి, మీరు పొద్దున్నే తాజాగా పుంజుకుని నిద్రలేచేదాకా పోషక శక్తిని సమకూరుస్తూనే ఉంటుంది.
మీకు తెలుసా ?
కోల్పోయిన శక్తిని, నిద్రించే సమయంలో అది భర్తీ చేసుకుందని డాక్టర్ల అభిప్రాయం. పోషక శక్తిని పెంపొందించే ప్రక్రియనూ శరీరానికి అవసరమయ్యే సరిచేయడాన్ని నిద్ర సాధ్యం చేస్తుంది.
DEPTH OF SLEEP
Hours
0 1 2 3 4 5 6 7 8
నిద్రావస్థ, పలుపలు పంపులైన తీరులో ఉంటుందని నిరూపిస్తోంది విజ్ఞాన శాస్త్రం. వివా మీకు విశ్రాంతిగా సరియైన పద్ధతిలో నిద్రపట్టేలా చేస్తుంది. మీరు ప్రొద్దున్నే తాజాగా పుంజుకుని నిద్రలేవటంకోసం, మీకావలసిన పోషక శక్తిని సమకూరుస్తుంది.
VIVA
The Day and Night Health Drink
BUILDS UP STAMINA
పగలూ, రాత్రీ,
ఆరోగ్యాన్నిచ్చే పానీయం
రుచికరమైన
వివా
JIL
జగత్‌జీత్ ఇన్‌డస్ట్రీస్ లిమిటెడ్.
పి.ఓ., జగత్‌జీత్ నగర్, కపుర్‌తలా జిల్లా (పంజాబ్)
ASP/JIL/1A/78

జి. ఆర్. బి. — ఖర్గపూరు

డబ్బున్నవాళ్ళు లేనివాళ్ళు-ఆడవాళ్ళు చీరల మీద గిల్టు వస్తువులమీద చూపించే శ్రద్ధ బంగారం మీద చూపించరేం ?

★ ఈనాడు విపరీతమైన బంగారం గిరాకీ కనుమాల ధనత. ఆడపిల్లలకి నగలమీదకంటే నాణ్యతమీద తల్లుల దృష్టి మళ్ళించవలసిన వల్ల వనూన్న చిన్నదయింది. బంగారం పెట్టుకోని, పెట్టుకోలేని స్త్రీ జాతిపై చిట్టా సమాజం చాలా చిన్న చూపు చూస్తుంది. నిర్లక్ష్యం చేస్తుంది. అందుకే 'ఏవో ఒకటి' అని గిల్టు నగలు ధరించేస్తారు! ఆడపిల్ల పుట్టినది మొదలు అలంకరణ మీద నగలమీద మోజు పెంచడం తగ్గిస్తే-ఉంటే విలువైనది ఒక్కటో రెండో ధరించాం-లేదా లేక పోయినా పరవాలేదన్న ఆధునిక దృక్పథం పిల్లల్లో పెరుగుతుంది. అదీ ముఖ్యం

పి. వి. ఆర్. — రాయగడ

నాటినుండి కవులు కవయిత్రులు ప్రకృతిని వర్ణించినప్పుడు ఆడదాన్ని వర్ణిస్తారు. ప్రకృతికి ఆడదానికి సంబంధం ఏమిటి?

★ సృష్టికి మూలం ప్రకృతి ఆడదే అంతే. కనుక

పి. బి. — గంగ్రవపూరు

ప్రేమకోసం జీవితాన్ని త్యాగం చేసినా, జీవితం కోసం ప్రేమ త్యాగం చేసినా మిగిలేది కన్నీరేనా ?

★ ఎప్పుడూ ఏడ్చేవాళ్ళకి - కన్నీరే కద మిగిలేది. అయినా ఏడుస్తూ చేస్తే, ప్రేమ త్యాగం కాదు బోర్.

బి. వి. ఎస్. ఆర్. — పోసపేట.

...వేశ్యావృత్తిలో మగ్గిపోతున్న అనాథ స్త్రీలకు ప్రభుత్వం ద్వారా రక్షణ. జీవనోపాధి కల్పించడానికి మీలాంటి వారెందుకు నడుం కట్టరు? ..

★ ప్రభుత్వం సంఘసేవ తలపెడితే-ప్రయోజనం శూన్యం-సరికదా, లొసుగుల వెనక చట్టం దాక్కుంటుంది! ముందు ప్రభుత్వం సాగిస్తున్న సేవా కార్యక్రమాలని మహిళాశిశుసంక్షేమ కార్యక్రమాలని ఒకసారి ప్రజల దృష్టికి తేవడం అవసరం. అప్పుడు స్వచ్ఛందసంస్థలు సేవకులు ఎందుకేనా ఉపయోగపడతారేమో. ప్రభుత్వం ఆలోచించి చూడాలి స్వచ్ఛంద సేవకులకి ఉత్సాహంవుంది. ప్రభుత్వానికి డబ్బుంది. రెండూ కలిస్తే పని జరుగుతుంది.

ప్రశ్నావళి

కె. రామలక్ష్మి

ఎ. ఏ — రేపల్లె

మీ ప్రశ్నావళి వనితలకు వంతపాట, పురుషులకు చేదుపుట. వనితలకు విప్లవబాట, వీరులకు సమ్మెట పోటు.

సమ్మెటపోటుకే జడిసేవాళ్ళని వీరులనడం ధర్మం కాదు భాయీ! ఇక చేదూ ఒకరుచే. మరిచిపోకు.

ఎస్. ఎన్. ఆర్. — కటక్

ఇందిరాగాంధీ మళ్ళీ తన స్థానాన్ని పొందగలదా?

★ ఆహా! దేశంలో అంతా యిలాగే గాజులు తొడిగించుకున్నారంటే!

ఎస్. పి. ఆర్. — పర్లాకిమిడి

నేనామెను మనస్ఫూర్తిగా ప్రేమించాను ఆమె కూడా నన్ను ప్రేమిస్తోందని భావించి ఆమెతో లైంగిక సంబంధం పెట్టుకున్నాను...ఫలితంగా...

★ చూశారా! ప్రేమ-కామం చాలా దగ్గరవి. అంటే సహృదయులు రాకాసుల్లా మీదపడతారు. ప్రేమ స్వచ్ఛమైనది! అంటూ అక్కడికి కామం అపవిత్రమైనదన్నట్టు! ప్రేమించిందని భ్రమించిన మీరు-యిప్పుడామె మోసం చేసిందని వాపోతున్నారా! ఆడజాతిని ఆడిపోసుకుంటున్నారా! తప్పదుమరి.

టి. పి. — అనంతపురం

మనస్సులో కోరిక వున్నా లేనట్టు నటించే మీ స్త్రీజాతి కంటే, స్పష్టంగా నిస్సంకోచంగా బయటపెట్టే మా పురుష జాతి ఎంత గొప్పదో నిష్పక్షపాతంగా చెప్పండి.

★ ఎలా ప్రభాకర్! ఇంకో మాటాడైతే చెప్పకలదేమో కోరిక. అది అనురాగం లాంటివన్నీ అభుదాటున పిండెలాగా తోటబాదు లాడాలేగాని సినిమాల్లో రేప్ చేయడానికి యిందుకు లంఘించే వీరుల కళ్ళల్లో-క్రూరంగా మెదిలే అసహ్యకరమైన మనోభావాల్లాగా వుండకూడదు. మరిక మీ యిష్టం-ఏ జాతి గొప్పదో తేల్చుకో... అవసరానికి సభ్యత తెలియదు అనురాగానికి ప్రేమకి తెలుసు. అందుకే కోరిక వేరు-తొందర వేరు అనడం.

బి.ఎల్. పి. పి హెచ్. — కొత్తచెరువు.

★ నాకెన్నో సందేహాలు రచనా సమస్యలపై, నేటి సంఘాభివృద్ధి కోసం...

★ సందేహాలుండడం-ఆరోగ్యకరమైన లక్షణం. బుద్ధిహీనులకూ, మూర్ఖులకూ మాత్రమే-సందేహాలుండవు!!

వెళ్ళాను అప్పుడే లలిత వచ్చి "భోజనానికి రండి" అన్నది.

"లలితా... నీవు అదృష్టవంతురాలివి, రవి లాంటి భర్త దొరకడం అదృష్టమే గదా! ఒక చెడు అలవాటు లేదు. ప్రేమగా చూసుకొంటాడు, ఒక్క మాట నిన్ను అనడు. ఇలాంటి జీవితం లభించేది ఏ కొందరికో... రవి,... నీలాంటివారు తక్కువగా వుంటారు, భార్య కూడ తనలాంటి మనిషే అని గుర్తించేవారు అరుదు. అందుకే లలిత అదృష్టవంతురాలు" అన్నాను.

"హుఁ ... ఏమదృష్టంలెండి ..." నీరసంగా అంది లలిత.

ఆశ్చర్యపోయి "అదేమిటె లలితా...నాతో పోల్చుకుంటే నీ వెంత సుఖపడుతున్నావో నాకు తెల్సు. రవికి నీ మాట వేదవాక్కు.

అభిమానం చాటున

(18వ పేజీ తరువాయి)

గాని..." అన్నాను.

"పదలేక్కా, భోజనానికిరా!" అన్నాడు.

"నాకు వద్దు" అన్నాను.

"ఛీ ఛ, నీవు బాధపడవద్దు. అన్నీ నేను సరిచేస్తాను అన్నానుగా... నీవు నిశ్చింతగా వుండు" అన్నాడు.

"ఏం చేస్తావ్... ఆయన నాకు మనస్ఫూర్తి మనిషిగా అనిపించటం లేదు లేకుంటే భార్య యింకొకరితో చెప్పుకొనేట్టు చేయవలసిన పరిస్థితేనా? యిది" అన్నాను.

"నిన్నింక మర్చిపొమ్మన్నానుగదా ఆ విషయం. నేనంతా సరిచేస్తానుగా..." తిరిగి అన్నాడు.

"ఏం సరిచేస్తావ్? మీ మగాళ్ళే అంత. మీ సుఖమేగాని, భార్య సుఖం చూడరు. పెళ్లయిన కొద్ది రోజులు ఎంతో మోజు. తర్వాత మీ యిష్టం మీది. మేము ఇంట్లో పడి మీరు చేసే పనులకు ఏడుస్తూ కూర్చోవాలి. ఏం మగజాతి మీది. ఛీ అసహ్యమేస్తుంది నాకు."

రవి ముఖం ఎర్రగా కందిపోయింది. "సరే! ఇంక మా మగాళ్ళను తిట్టకు. నీ మాటలతో నేను ఏకీభవిస్తున్నాను. లేచి అన్నం తిందువుగాని..." అంటూ లాక్కొని డైనింగ్ రూంలోకి తీసుకుపోయాడు.

ఆ తర్వాత రవి ఎక్కువ మాట్లాడ లేదు. లలిత మాత్రం మాట్లాడిమాట్లాడి వుంది. రవి సరిగా భోజనం చేయకుండానే లేచాడు.

"అదేమిటండీ... అలానే వదిలేసారు

అన్నమంతా!" లలిత బాధగా అంది.

"సయించలేదు లలితా" అన్నాడు.


వెంటనే పళ్లరసం తీసి రవికి యిచ్చింది లలిత.

అది చూసి నేను "చూడు రవి మా ఆడవాళ్లకి ఎంత ప్రేమ వుంటుందో మీ పైన. కనీసం మీరు, 'ఎలా తిన్నావ్?' అని కూడ అడగరు. కొంచెం కూరలు బాగా లేకున్నా ఒక్కోరోజు భోజనంలో ఏ లోటు కనిపించినా యింతెత్తు ఎగురుతారు. ఏవరో నీలాంటివాళ్లు ఏ కొందరో తప్ప" అన్నాను.

వెంటనే అక్కడనుంచి వెళ్లిపోబోయాడు.

నేను ఆపి, "రవీ నేను నీకు బాధ కలిగించాను కదూ. నీవు సరిగా భోజనం కూడ చేయలేదు. పాపిష్టిదాన్ని! నా బాధ నేను పడకుండా నిన్ను బాధ పెడుతున్నాను!" నా కంఠం జీర పోయింది.

"లేదులే! పద్మక్కా ... అమాయకం బాధపడవలసిన వాడినేగదా!" అని వెళ్ళి పోయాడు.



అభిమానించాలున

రెండురోజులు గడిచి పోయాయి.

"అక్కా... బావగారు క్యాంప్‌కి వెళ్ళి వున్నారట. వస్తే ఫోన్ చేయమని చెప్పి వచ్చాను మీ ప్యూన్‌కి" అన్నాడు.

నేనేమి మాట్లాడలేదు. ఇంతవరకు అనుమానపడని రవి "నీవు వచ్చేప్పుడు బావగార్కి చెప్పివచ్చావా?" అన్నాడు.

"లేదు. నేను వచ్చేరోజే ఆయన క్యాంప్ కెళ్ళారు. 'నేను మా యింటికి వెళ్తాను.' అని చెప్పమని ప్యూన్‌కి చెప్పివచ్చాను."

ఆలోచనలోపడినాడు. బహుశ తను ఆలోచన చేసేది 'ఏ విధంగా ఆయన్ని చివాట్లు పెట్టాలి? నన్ను తిరిగి అక్కడ ఎలా వదిలి పెట్టాలి?' అనుకొంటున్నాడేమో తర్వాత ఒకరోజు గడిచిపోయింది. నేను వుండగానే మా ప్యూన్ రాము ఫోను చేసాడు. "అయ్యగారు వచ్చారు."

రవి అరగంట తర్వాత వచ్చాడు. నేను ఆయన వచ్చిన విషయం చెప్పాను. కాసేపు తర్వాత రవి వెడతా వుంటే "నేను వస్తాను" అని వద్దన్నా వినకుండా బయల్దేరాను.

"నీవు ఎలా అంటే అలా అడక్కు ఆయన్ని" అన్నాను.

"సరేలే! నాకు తెల్సు." అన్నాడు గంభీరంగా.

మేము వెళ్ళేసరికి అప్పుడే టీ త్రాగుతున్నారు. "అరె! ఎప్పుడు రావడం, కూర్చోండి" అన్నారు ఆయన నమ్మల్పి. "రాము ... యింకో రెండు కప్పులు టీ తీసుకురా."

"మీ అతిథి మర్యాదలన్ని తర్వాత. అసలు విషయానికి వద్దాం" అని సీరియస్‌గా అన్నాడు ఆయన్ని చూసేసరికి రవికి ఆవేశం పెరిగింది. అంత ఆవేశ పడ్తాడని నేను ఊహించనేలేదు.

"ఏమిటి?" అని తెల్లబోయాడు రవి ముఖం చూసిన ఆయన.

నాకు 'పక పక' నవ్వాలనిపించింది ఆ సమయంలో ఆయన్ని చూసి. కాని చాల సీరియస్ అయ్యాను.

"మీరు పెళ్లి చేసుకొన్నవారు భార్య నెలా చూసుకోవాలో అనే విషయం తెలియదా? నాకు ప్రాణంతో సమానం పద్మక్క.

ఆమెకు ఏలాంటికష్టంకలిగినా నేను భరించ లేను. అందుకే ఏరికోరి మీతో వివాహం చేయించాను. ఆ విషయం మీకు తెల్సు. మనమెంత మగవాళ్లమయినా... కొంత హద్దులో వుండాలి. మీరు దీనికి సంజాయిషీ చెప్పండి? పద్మక్కను మీ రెండుకు బాధి స్తున్నారు?"

"నేనా... నే నెప్పుడూ బాధ పెట్టలేదే ఏమిటిది..."ఆయన తడబడసాగినారు.

నావైపు చూసి రవి "చెప్పు... ఆయన మాటకి జవాబు" అన్నాడు.

"మీరు... మీరు అబద్ధం ఆడు తున్నారు" అన్నాను ఆయనకేసి చూసి.

ఆయనకు బాగా కోప మొచ్చింది. "ఏమిటి పద్మా... నీవు. అనవసరంగా నా పైన నిందలు ఏమిటి? నీ కేమైనా పిచ్చి పట్టిందా?" నావైపు చూస్తూ కోపంగా అరవసాగారు.

నేను రవివైపు చూసి ముఖం దించు కొన్నాను. నాలో రేగే కలకలం ఆపుకోను చాల శక్తి కావల్సి వచ్చింది. నన్ను నేను కంట్రోలు చేసుకోలేక పోతున్నాను.

"పద్మక్క అబద్ధం చెప్తుందా? మీరు రోజూ తాగి రావటంలేదూ?... అర్ధరాత్రి వరకు యింటికి రారు! ఆమెని తిట్టడం, కొట్టడం కూడ చేస్తున్నారు! మీ సంస్కార మేమయింది?..."

ఆయన నోట మాటరాక అలానేచూస్తు న్నారు రవి వైపు, అప్పుడప్పుడు నాకేసి. ఆఖరుకు రవి వాక్బాణాలను తట్టుకోలేని ఆయన "రవి, నీకేమైనా పిచ్చి పట్టిందా? యూ గెట్ అవుట్?" భరించలేని ఆయన పెద్దగా అరిచారు.

"నాకేం పిచ్చిలేదు. మీకే వుంది పిచ్చి. ఆ పిచ్చిని అదుపులో పెట్టుకోమని చెప్పను వచ్చాను!"...

రవి మాటలు భరించలేక ఆయన ఏదో అనబోయారు. నేను రవిని ప్రక్కకి తీసు కెళ్లి, "రవీ, నీవెళ్ళిపో? యింకా ఏమైనా అన్నావంటే యింకా కోపపడ్తారు. అయినా నిన్ను తొందరపడి యిలా అడగ వద్దని చెప్పానా ? ఇప్పటికే నీ మాటలకు బాగా కోపం వచ్చివుంది. నేనే ఏదో సరి చేసుకొంటాను. నీవు వెళ్లిపో! దయచేసి."

"వద్దు. నీవు యింటికొచ్చెయి నాతో" అన్నాడు రవి.

"నేను రాను !" అన్నాను.

"నా ఎదురుగానే చూసాను. కొద్ది రోజులు నీవు యిక్కడ వుండకుండా వుంటే బుద్ధివచ్చిందా వచ్చినట్లు. లేకుంటే ..."

"రవీ ప్లీజ్, నీకు ఆవేశమేగాని ఆలోచన లేదు. ఇంకొన్ని రోజులు ఓపిక పడ్తాను. అనవసరంగా నీవు తొందరపడి నా జీవితాన్ని నాశనం చేయకు." అని కంటనిండా నీరు పెట్టుకొన్నాను. మా మాటలు చిన్నగా ఆయనకు వినిపిస్తు వున్నాయి.

తర్వాత నాకేవేవో కొన్ని జాగ్రత్తలు చెప్పి వెళ్ళిపోయాడు బాధగా. రవి నాకోసం పడే బాధను భరించలేక పోయాను. కాని తప్పదు. ఒకేతల్లికి పుట్టకున్నా, నా పైన తను చూపించే ప్రేమకు నా మనస్సు ఎంతో గర్వంగా రవి అంటే నాకు యింకా అభిమానంతో పొంగింది.

నేను లోపలకు నడిచాను. ఆయన నా వైపు కోపంగా చూస్తున్నారు: ఆ క్షణంలో ఆయన్ని చూసిన నాకు నవ్వాగ లేదు. నవ్వుతో మెలికలు తిరిగిపోతున్నాను. నవ్వలేక పొరపోయింది. అంతవరకు ఏమి పట్టనట్టు నన్ను చూస్తున్న ఆయన యింక చూడలేక నా దగ్గరకు వచ్చి "ఏమిటిది పద్మా ... ఎందుకిలా నవ్వుతున్నావ్ ? ఏంజరిగింది చెప్పు ?" అని గాభరాగ అడిగేరు.


అడిగేకొద్దీ నవ్వు యింకా ఎక్కువైంది నాకు. చాలసేపు వరకు నవ్వుతూనే వున్నాను. చివరకు అసలు విషయమంతా ఆయనకు చెప్పేసరికి "దొంగపిల్లా యింత నాటకమా ?" అని నవ్వారు.

"రవి రోజూ రాత్రి ఆలస్యంగా వస్తు న్నాడు. అప్పుడప్పుడు తాగుతున్నాడు. లలిత పైన చెయ్యి కూడ చేసుకొంటు న్నాడు. ఇంట్లో ప్రతిచిన్న విషయానికి జగడమే."

లలిత ఆ బాధ భరించలేక నాకు వచ్చి చెప్పింది రవికి తెలియకుండా. తెలిస్తే 'ఏంచేస్తాడో యింకా' అని లలిత భయం.

"రవి ఎందుకిలా మారినాడు ?" నాకు అర్థంకాలేదు అంతకు ముందు అంత సన్నిహితంగా మేము మాట్లాడుకోము. కొన్ని విషయాలకే మా ప్రసంగం పరిమితం చేసుకొన్నాం. చదువుకొనే రోజుల్లో ఒకటి, రెండుసార్లు ఫ్రెండ్స్‌తో తాగాడు. అదీ చాల కొద్ది. "తమాషాగా చేస్తే ఎలా వుంటుందోని తాగాను. అంతే గాని అలవాటు ఎలాచేసుకొంటాను ?" అని తనేచెప్పాడు అందుకని నేను ఏమీపలుకలేదు.

మంచి ప్రవర్తనగల వ్యక్తిగా రవి నాలో ముద్ర వేసుకొన్నాడు. ఎంతో సంస్కార వంతుడైన ఆ...రవి, యిప్పుడిలా మారిన రవిని "ఎదుకు ఇలా చేస్తున్నావ్?" అని అడగను నాకే మనస్కరించటంలేదు. అసలా ప్రసంగం తనతో ఎత్తడమే నాకు అవమానంగా అనిపించింది. ఒకవేళ అడిగినా ఏలాంటి జవాబు చెప్తాడో! ఏదైనా నన్ను అంటే భరించగలిగే శక్తి నాకులేదు. కాని రవి యిలాగే వుండిపోవాలా? అతన్ని మంద లించే గాధ్యత నాకు లేదా ? అభిమానం చాటున ఏమైనా చేయగల అవకాశం నాకు వుంది. అందుకని రవి తన తప్పు తాను



అభిమానంచాటున

తెలుసుకోవాలనే ఉద్దేశ్యంతో రవి లలిత విషయంలోను వ్యక్తిగతంగాను ఎలా ప్రవర్తిస్తున్నాడో... అలాగే రవికి అనుమానం కలగకుండా మావారు ప్రవర్తిస్తున్నట్లుగా నటించాను. అప్పటికి రవి తన తప్పు నేను చెప్పకనే తెల్సుకొన్నాడు అనే విషయం రవి మౌనంలోనే నాకు అర్థమయింది.

నా బాధను తను అర్థం చేసుకొన్నాడు కాబట్టి లలిత విషయంలో యిక ఎప్పటికీ ఆ విధంగా ప్రవర్తించడని నాకు తెల్సు.

కొద్దిరోజులు గడిచిపోయాయి. మధ్యలో రవినాకు ఫోన్ చేసాడు. "ఇప్పుడు నాతో బాగుంటున్నారు ఎప్పటిలా వున్నారు!" అనిచెప్పాను. లలిత కూడా ఫోన్ చేసి "పద్మా. మీకు చాలా థాంక్స్. ఇప్పుడు రవి మునుపు లాగే వుంటున్నారు" అని చెప్పింది.

'తృప్తి'గా నిట్టూర్చాను.

రవి, లలిత నెల రోజుల తర్వాత మా యింటికి వచ్చారు. ఆ సమయంలో ఆయన యింట్లోనే వున్నారు రవిని చూసి ఆయనేమీ మాట్లాడలేదు బహుశ మనస్సులో నవ్వుకొంటూ వుండి వుండవచ్చు లలితతో మాట్లాడుతూ కూర్చున్నారు.

రవి నేరుగా నా వద్దకువచ్చి "పద్మక్కా బావగారు పలుకరించలేదే ఇంకానాపై కోపం కోపంగా వున్నారా? ఇప్పుడేమి అల్లరి చేయడంలేదు గదా!" అన్నాడు మెల్లిగా.

నేను ఒక నిశ్చయానికి వచ్చి, "రవీ... నేను ఒక నాటకమాడాను. నన్ను క్షమిస్తావ్ గదూ..."

తెల్లపోయి "ఏమి! నాటకం" అన్నాడు.

"నీవు నాకు మాటివ్వాలి..."

"అలాగే" అని నా చేతిలో చెయ్యి వేసాడు.

"రవీ, నిజంగా ఆయనకు త్రాగుడు, నన్ను తిట్టటం వగైరా, వగైరా నీకు చెప్పినదంతా అబద్ధం. నీవు లలితను యిలా చేస్తున్నావని లలిత నాకు చెప్పుకుని ఏడ్చింది. నిన్ను నిలదీసి "ఇదేమిటి" అని అడగలేకపోయాను. కారణం నీవిలా మారావ్ అనేదే భరించలేక పోయాను. నీ ప్రవర్తన నా మనస్సులో నేను అనుకొనే మనస్కరించలేదు. అందుకే నీ తప్పు నీకు తెలిపేట్టు నాటకం ఆడాను. నెగ్గాను. నాపై నీకున్న ప్రేమ నిన్ను రక్షించింది. నేను మామూలుగా నిన్ను మందలించి వుంటే, నన్ను ఏమైనా అంటావేమోని, లలితను 'ఎందుకు చెప్పావ్?' అని తిడ్తావేమోని భయపడ్డాను. ఆరోజు మనిద్దరం యిక్కడకు వచ్చాము కదూ... ఈ నాటకం, ఈ విషయం ఆయనకు తెలియనే తెలియదు. అందుకే ఆరోజు అలా ఆశ్చర్యపోయారు. నాపై కోపం కూడా వచ్చింది. నన్ను బాగా అర్థం చేసుకొనేవారు కాబట్టి నీకోసం ఆయన్ని యిలా యిరికించను సాహసం చేసాను.

రవీ... మీ మగవారు చాలమంది భార్యలను అసలు పట్టించుకోరు. వారు 'బాధపడ్తారే' అనేది అసలు గమనించరు. భార్యే కదా, నా అండన వుంది కదా అనే అహంతో నోటికొచ్చినట్లు మాట్లాడతారు. అదే ఏ చెల్లికో, అక్కకో, యింకెవరికయినా అలా జరిగితే ఒప్పుకోలేరు. మీ బావగారు నా విషయంలో అలా ప్రవర్తిస్తే నీవెంత బాధపడినావో నీకేతెల్సు. లలితావాళ్ళ అన్నతమ్ములైనా అంతేకదా? నీకు నేను చెప్పేకంటె ఈ విధంగా చేయడం ద్వారా నీ పొరపాటు నీవు బాగా గుర్తిస్తావని, యింకెప్పుడు యిలాంటి పొరపాటు చేయవని, నీవు సంస్కార హీనంగా ప్రవర్తించటం సహించలేని నేను ఆయన్ని నీ దృష్టిలో చెడ్డవాడిగా చేసాను. దీనివల్ల నీకేమైనా బాధ కలిగితే క్షమించు, కాని నీవు మునుపటి రవివే అయ్యావ్! అందుకు నాకు సంతృప్తిగా వుంది. నీవెంత కోప్పడినా యిప్పుడు నాకేమి బాధ కలుగదు." అన్నాను.

కళ్ళు విప్పార్చి నేను చెప్పే విషయమంతా విన్నాడు. తర్వాత కాసేపు ఏమి మాట్లాడలేదు.

"క్షమించు పద్మక్కా ... పొరపాటే నాది. అప్పుడు రెండు రోజులు ఫ్రెండ్స్ ఒత్తిడితో త్రాగాను. అలానే అలవాటయింది. లలిత ఏమైనా అంటే వినుకోకని చివరకు అలా దిగజారాను. నీ నాటకంతో నాకు జ్ఞానోదయం అయింది. చాల థాంక్స్ పద్మక్కా నీకు" అని "ఆ రోజు బావగారిని నోటికొచ్చినట్లు బాగాతిట్టాను. క్షమాపణ కోరుకొంటాను వెళ్ళి" అని ఆయన దగ్గరకు పరుగు తీశాడు.

నేను సంతృప్తిగా నవ్వుకొంటూ చూస్తుండిపోయాను.

అలారం చీటీ !

అమెరికాలో కొన్ని డిపార్ట్‌మెంటల్ స్టోర్సుల్లోని సరుకులమీద వాటివెలను రాసిన చీటీలు కట్టారట. కొనుక్కొనేవారు ఆ సరుకుల ఏరుకుని డబ్బు కట్టేచోటుకు వస్తే అక్కడి వారు ఆ వెల కట్టిన చీటీమీద ఓ గుర్తువేసి, డబ్బు తీసుకుంటారట. డబ్బు లివ్వకుండా ఏ



సరుకైనా ఎవరైనా పొట్లంకట్టుకుంటే గుమ్మం దాటుతుండేసరికి ఆ చీటీ ద్వారా ఓ అలారం మ్రోగుతుందట. అసలా చీటీని చింపేస్తేనో !

అలవాట్లో పొరపాటు !

బెంగుళూరులో సియస్ యస్ ఆర్ ఆసుపత్రిలో ఓ కేటమ్మ అనే ఆవిడకు ఏప్రియల్ 19వ తేదీన కడుపునొప్పికో దేనికో ఎబ్డామినల్ ఆపరేషన్ చేశారట డాక్టరుగారు. ఆసుపత్రినుంచి యింటికి వెళ్ళాక ఆవిడకు ఆ నొప్పి యింకా ఎక్కువైతే మళ్ళీ ఆసుపత్రిలో చేరిందట. అదే డాక్టరుగారు ఆమెకు మళ్ళీ వైద్యం ఆరంభించారట. ఒక రోజామె మల విసర్జనలో ఓ బ్లేడుముక్కలాంటిది పడిందట. దాంతో ఆవిడకు ఎక్సరే తీస్తేపోయిన ఆపరేషనులో ఆ డాక్టరుగారు ఆవిడపొట్టలో వదిలేసిన వో పనిముట్టు కనుపించిందట.

*　　*　　*


భుజ్ కు చెందిన జస్టా అనే గ్రామంలో కుటుంబనియంత్రణ శస్త్రచికిత్స గుడారంలో వో 27 ఏళ్ళామెకు ట్యూబెక్టమీచేస్తామని పడుకోబెట్టి వో డాక్టరుగారు ఆమె చిన్నప్రేవులు పుట్టుక్కన కత్తిరించేశారట. దాంతో ఆ నలుగురు పిల్లల తల్లిని రయమున పెద్దాసుపత్రికి మోసుకుపోయారట.

నాట్యంచేసే గవర్నర్

నేను మొట్టమొదట గవర్నరునిగాక ప్రస్తుతం నాట్యం చేసే గవర్నరును కూడా అయ్యాను అని గుజరాత్ గవర్నర్ శారదాముఖర్జీ అన్నారట.

కాకులవల్ల వ్యాప్తిచెందే కొత్తరకంజబ్బు !

దోమలవల్ల మలేరియా, బోదకాలు వంటి రోగాలు రావడం అందరూ ఎరిగినదేనని, యిప్పుడు ఆ కోవకి చెందిన మరో కొత్తజబ్బు మనదేశంలో విజృంభించవచ్చునని వైజ్ఞానికులు అంచనా వేస్తున్నారు. జాపనీస్ ఎన్సిఫాలిటీస్ అనే యీ జబ్బుకు ముద్దుగా జెఇ అని పేరు పెట్టారు. ఈ రోగం పక్షుల ద్వారా ఓ ప్రదేశంనుంచి మరో ప్రదేశానికి చేరుతుందని, ముఖ్యంగా కాకుల వల్ల యిది అనేక ప్రదేశాలకు పోతోందని వీరన్నారట. ఇప్పటికప్పుడే యీ జబ్బు అస్సాంనుంచి పశ్చిమ బెంగాలు వరకు, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌లకు వ్యాపించిందట. అసలీజబ్బు 1954లో వెల్లూరుకు సోకిందని, మదరాసుకు చెందిన వెల్లూరునుంచి ఆగ్రాకు 1958లో వెళ్ళిందని అక్కడ నుంచి 1978 ఫిబ్రవరిలో తిరువళ్ళూరికి తిరిగొచ్చిందని నిపుణులు అన్నారట. ఈ రోగం చాలా భయంకరమైనదట. తిరువళ్ళూరిలో 76 మంది దారుణంగా యీ జబ్బు వాతపడిచనిపోయారట. జపాను నుంచి దిగుమతి చేసికొనే టీకా మందు ఒక సంవత్సరం లోపు పిల్లలకు పదిహేను రోజులు వ్యత్యాసంలో రెండుసార్లు యివ్వాలని, ఏడాది దాటిన పిల్లలకు యీ మందు ఒకసారి ఇచ్చినంతమాత్రానే ఫలితమిస్తుందని కూడా వారన్నారట. ఇన్ని చెప్పినవారసలా రోగం ఏవిటో ఏ రూపంలో వస్తుందో చెప్పలేదు.




బ్రూ-కమ్మని రుచికి, సువాసనకి మొదటి రకము

దక్షిణ భారత దేశంలోని కాఫీ అభిమానులను అడగండి. మీ పొరుగు వారిని అడగండి.



సుశీలా రవీంద్రనాద్, ఇల్లాలు.
మా కుటుంబం బ్రూ కు అలవాటుపడింది. అందుకే గాక నా బడ్జెట్ కు కూడా సహకరిస్తుంది.



విజయ కుమార్ రావు, క్రికెట్ ఆటగాడు.
గ్రౌండు కాఫీ సువాసనను మరేదీ ఎదిరించ లేదు. అందుకే బ్రూను కోరుకుంటాను.



శ్రీ మరియు శ్రీమతి హరిశంకర్, నూతన దంపతులు. మేము ఇష్టపడేది సారమైన కాఫీ అయితేనే — బ్రూ అనుకూలమైనది కూడా.



శ్రీ. కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్.
దబరాలో పొగలు కక్కే రుచికరమైన, సారవంతమైన కాఫీనే ఇష్టపడతాను.



బ్రూ—దాని వెల ఎంతో ఆకర్షణీయమైనది
ఏ కాఫీ అభిమానిని అయినా అడగండి

OBM-5703A/1 TEL



ఊరూర దేవాలయం
ఇంటింట
గ్రంథాలయం
ఉండాలోయ్!
మంచి మంచి పుస్తకాలు కొనుక్కు చదువుకోవాలని వాటితో తన ఇంట్లో చక్కటి గ్రంథాలయం పెట్టుకోవాలనీ ఎవరికి ఉండదు?
ఐతే సులువుగా చౌకగా ఎవరికి వారు గ్రంథాలయం ఏర్పరచుకొనేందుకు అపాయం లేని ఉపాయం ఒకటుంది!
అదే-ఆంధ్రప్రదేశ్ బుక్ డిస్ట్రిబ్యూటర్స్ వారు నిర్వహిస్తున్న
ఇంటింటా
స్వంత గ్రంథాలయం ప్రణాళిక!
"తెలుగు పుస్తక ప్రియుల పాలిటి వరం"
నెలకి రూ.10 లతో మీ యింట గ్రంథాలయం నెలకొల్పుకోండి!
HLP
APBD
BOOKS FOR YOU
నెలకి రూ.10ల చొప్పున 12 నెలల చందా పూర్తి చేస్తే
మీరు కట్టే రూ.120 లకి రూ.135ల పుస్తకాలు వస్తాయి!
వీటిని 150 పబ్లిషర్ల ప్రచురణలు, 2000 ఉత్తమ గ్రంథాలనించి ఎన్నుకోవచ్చు!
ఇవికాక-8 ఉచిత పుస్తకాలు లభిస్తాయి! వీటిని ప్రత్యేకం ఎన్నిక చేసిన ప్రచురణల నించి ఎన్నుకోవచ్చు!
ఈ పుస్తకాలన్నీ మీకు రవాణా ఖర్చులేకుండా అందుతాయి!
మొదటి నెల చందా కట్టగానే...
1. మీరు ఎంచుకున్న 2 ఉచిత పుస్తకాలు
2. 2,000 తెలుగు పుస్తకాల వివరాలతో పెద్ద కేటలాగ్.
3. ఆ నెల "పుస్తకప్రపంచం" సప్లిమెంట్...
ఇవన్నీ మీకు ఉచితంగా అందుతాయి!
చందా 6 నెలలు కట్టేసరికి...
మా కేటలాగు లోంచి మీరు ఏరి కోరుకునే రూ.60.ల పుస్తకాలు, ఆ పైన మరో 3 ఉచిత పుస్తకాలు. పుస్తకప్రపంచం సప్లిమెంట్ నెలవారీ మరో 5 సంచికలు లభిస్తాయి!
12 నెలలు పూర్తికాగానే....
మీరు ఏరికోరుకునే మరో రూ.75ల పుస్తకాలు; మరో 3 ఉచిత పుస్తకాలు; అప్పటికి మరో 6 పుస్తకప్రపంచం సప్లిమెంట్ సంచికలూ మీకు — చేరుతాయి!
మీరు కట్టేదేమో రూ.120లు మాత్రమే. అదీ తేలిక వాయిదాలలో!
మీకు వచ్చేది | కలిసి వచ్చేది
మీరు కట్టే రూ.120లకి రూ.135ల మంచి పుస్తకాలు | రూ. 15.00
8 ఉచిత పుస్తకాలు | రూ. 28.00
ఫ్రీ పోస్టేజీ | రూ. 12.00
పెద్ద కేటలాగ్ | రూ. 2.00
మీకు కలిగే లాభం | రూ. 57.00
పైసా నష్టం ఉండదు!
ఒకవేళ ఏ కారణం చేతనైనా చందాదారులు మధ్యలో మానివేయదలిస్తే నిరభ్యంతరంగా మానివేయవచ్చు. వారు కట్టిన ఒక్క పైసా కూడా నష్టపోరు. దాని విలువకు సరిపోయే పుస్తకాలు వారికి తప్పక వస్తాయి. అయితే వారికి పంపిన ఉచిత పుస్తకాల వెల, కేటలాగ్ వెల, రవాణా ఛార్జీలు మాత్రం ఈ చందా మొత్తంలో మినహాయిస్తాం!

హైదరాబాదు నోట్‌బుక్

వైభవోపేతంగా రాష్ట్రావతరణోత్సవాలు:—

రాష్ట్రావతరణదినోత్సవాలు జంటనగరాలలో కడు వైభవోపేతంగా జరిగాయి. తొలి అవతరణ దినోత్సవంనాటి ఆనందోత్సాహాలు పరిఢవిల్లాయన్న అతిశయోక్తికాదు. ఈ ఉత్సవాన్ని పురస్కరించుకొని కవిసమ్మేళనాలు, గోష్ఠులు, సాంస్కృతిక కార్య కలాపాలు జంటనగరాలంతటా జరిగాయి. రవీంద్రభారతిలో జరిగిన ఉత్సవాలకు అధ్యక్షత వహించిన ముఖ్యమంత్రి డాక్టర్ మర్రి చెన్నారెడ్డి రాష్ట్రప్రజలకు శుభాకాంక్షలు తెలియజేశారు. తమ పార్టీ చేసిన వాగ్దానాలు నెరవేర్చడానికి తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో ప్రయత్నిస్తుందని నొక్కిచెప్పారు.

రవీంద్రభారతిలో జరిగిన కవిసమ్మేళనానికి ఆస్థానకవి డాక్టర్ దాశరథి అధ్యక్షతవహించారు. ఈ సమ్మేళనం శ్రీ కప్పగంతుల లక్ష్మణశాస్త్రి సంస్కృత కవితతో ఆరంభమయింది. మహబూబ్ కాలేజీలో జరిగిన కవిసమ్మేళనానికి డాక్టర్ రాయప్రోలు సుబ్బారావు అధ్యక్షత వహించారు. దానిలో తిరుమల రామచంద్ర సంస్కృత కవితా గానం చేశారు. చార్మినార్‌లోని మొఘల్పురా భవనంలో ఉరుదూ ముషాయిరా పంచాయత్ రాజ్ శాఖా మంత్రి శ్రీ ఎం. బాగారెడ్డి అధ్యక్షతన జరిగింది. రవీంద్రభారతిలో జరిగిన కవి సమ్మేళనంలో శ్రీయుతులు బోయి భీమన్న, సి. నారాయణరెడ్డి, నాయని కృష్ణకుమారి, పి. యశోదారెడ్డి, మాల కొండయ్య, జె. బాపురెడ్డి, కప్పగంతుల లక్ష్మణ శాస్త్రి, కుందుర్తి ఆంజనేయులు, ఎల్లోరా, గులామ్ యాసిన్, బాలాంత్రపు రజనీకాంతరావు, లక్ష్మీ రమణ పాల్గొన్నారు. మహబూబ్ కాలేజీలో జరిగిన కవి సమ్మేళనంలో శ్రీయుతులు దివాకర్ల వేంకటావధాని, నండూరి కృష్ణమాచార్యులు, ముకురాల రామారెడ్డి, అరిపిరాల విశ్వం, సుది గొండ వీరభద్రమూర్తి, టి. వి. కృష్ణారావు, గంగిశెట్టి లక్ష్మీనారాయణ, సిలా జంగయ్య, శారదా అశోకవర్ధన్, తిరుమల రామచంద్ర, వడ్డెపల్లి సత్యం, పోతుకూచి సాంబశివరావు పాల్గొన్నారు. శ్రీయుతులు ఉత్పల సత్యనారాయణా చార్యులు, శార్వరి నగరంలో లేనందున రాలేక పోయారు. సంస్కృత కవితలలో రెండుశ్లోకాలు ఉదాహరిస్తాను. తిరుమల రామచంద్ర తమ సంస్కృత కవితలో

"గ్రామె గ్రామే జ్వలతి చపలా
దీపికా మాలికాయా
వారం వారం వదతి జనతో
ద్యోగశక్తిం పరిష్కా మ్.
యంత్రారావాః శ్రవణసుభగాః
శేకి శేకానుకార్యాః
క్షేత్రాయంతే జనపద మహా
భాగ్య మాదర్శయంతః."

అని రాష్ట్ర విద్యుదీకరణను, పరిశ్రమ వ్యాప్తిని గానం చేయగా, శ్రీ లక్ష్మణశాస్త్రి

"కలాభిస్సర్వాభిః నిగమనదవీభిః
శ్రుతనయైః
కవిత్వప్రఖ్యాభిః లలిత హృదయైః
బుద్ధి విభవైః
ప్రశస్తైరాచారైః అభినవవచో
జ్యోతిభిరిమే
సువిఖ్యాతా ఆంధ్రాః విజయ
మభియంతు ప్రతిదినమ్"

అని శుభాశంసన చేశారు. ముషాయిరాలో శ్రీయుతులు కమల్ ప్రసాద్ కమల్, అజీజున్నీసా సలా, షాద్ తమకనత్, అవుజీ యాకూబ్, సలావుద్దీన్ నయ్యర్, రహమాన్ సిద్దీన్, అమీర్ అహమద్ ఖుస్రో, షౌకత్ నదీమ్, నాజిర్ కర్నూలీ, విఖార్ ఖలీల్, రయూస్ అఖ్తర్, అఖ్తర్ హుసేన్ పాల్గొన్నారు.

విజయనగర మునిసిపల్ కమ్యూనిటీహాలులో శ్రీ శేషవసంతుల నరసింహశాస్త్రి అధ్యక్షతన జరిగిన అష్టావధానంలో శ్రీ డి.కె. బాలబ్రహ్మచారి రంజకంగా అష్టావధానం చేశారు.

రవీంద్రభారతిలో పాల్గొన్న కవులకు శ్రీ దాశరథి సత్కరించగా, ఆయనను సమాచార ప్రచురణశాఖ డైరెక్టర్ జనరల్ డాక్టర్ ఎ. ఆర్. బాజీ సన్మానించారు. మహబూబ్ కాలేజీలో పాల్గొన్న కవులను శ్రీ రాయప్రోలువారి తరపున డాక్టర్ పి.ఎస్. ఆర్. అప్పారావు సన్మానించారు.

సనత్‌నగర్‌లోని ఆల్విన్ మెటల్ వర్క్స్ ఆవరణలో సంస్థ అధ్యక్షుడు శ్రీ అజీత్‌సింగ్ అధ్యక్షతన అనుబంధ పరిశ్రమల అభివృద్ధిని గురించి గోష్ఠి జరిగింది. ఉస్మానియా విశ్వవిద్యాలయంలో 22 సంవత్సరాల అభివృద్ధిని గురించి గోష్ఠి జరిగింది.

సాయంకాలం రవీంద్రభారతిలో జరిగిన సాంస్కృతిక కార్యకలాపం ప్రేక్షకులను విశేషంగా ఆకర్షించింది. ప్రముఖ నర్తకి శోభానాయుడు అన్నమాచార్య పదాలు—కలువ రేకుల తల్లి సమశించెనూ, ముద్దుగారే యశోదా తనయుడు—అనేవాటిని, రాధికా కృష్ణా అనే అష్టపదిని అతి మనోహరంగా అభినయించారు. శ్రీ పాలగుమ్మి విశ్వనాథం సంగీతదర్శకత్వంలో శ్రీమతి వేదవతీప్రభాకరరావు "సుందరీ తెలుగు తల్లి" అనే గీతాన్ని సుందరంగా ఆలపించగా, శ్రీ కే.వి.కే. మోహనరాజు "ఒకటేరా తెలుగు జాతి" అనే శ్రీ బాపురెడ్డి గేయాన్ని ఎలుగెత్తి పాడారు. శ్రీ సంపత్కుమార్ బృందం నృత్య నాటికలలో శ్రీశ్రీ గేయాలు ఆకర్షించాయి.



ఉపశ్రుతి :—

"ఏమిటండీ, ఇంతఘనంగా నగరమంతటా రాష్ట్రావతరణవార్షికోత్సవాలు జరుగుతుంటే, తెలంగాణా ప్రత్యేక వాదులు నిరసనదినంగా పరిగణిస్తూ ఈ రోజును?" అని అడిగాడు ఒక అమాయకుడు. "అయ్యా, ఒక మహాయజ్ఞం జరుగుతుంటే, విఘ్నకారులు ఉండనే వుంటారు. ఇది ప్రజాస్వామ్యం—అంటే అధిక సంఖ్యాకుల పాలన. అల్పసంఖ్యాకవర్గం చిరుబుర్రుమంటూనే వుంటారు." అన్నారొక రాజనీతిజ్ఞులు.

— తిరుమల రామచంద్ర

వారఫలం

8 12 1978 శుక్రవారం మొదలు
14-12 1978 గురువారం వరకు

మేషం:- ఉద్యోగంలో శ్రమ కలుగుతుంది మీ తాలూకు వస్తువులు పోవచ్చును. వారం మధ్యలో ప్రయాణాలు ఫలిస్తాయి. వృత్తిలో ఆదాయం బాగుంటుంది భాగస్వాములతో కలిసి చేసే వ్యాపారాలు లాభిస్తాయి. స్త్రీలకు- ఆరోగ్యం బాగుండదు. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది.

వృషభం: వృత్తి వ్యాపారాలు ప్రోత్సాహకరంగా ఉంటాయి ప్రయాణాలు ఫలిస్తాయి. వారం మధ్యలో మీ ప్రయత్నాలకు ఆటంకాలు వస్తాయి. చికాకులు యేర్పడతాయి. వారం ఆఖరులో అన్ని వ్యవహారాలు తిరిగిబాగుంటాయి. స్త్రీలకు కుటుంబ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది సంతానానికి సౌఖ్యసంతోషాలులభిస్తాయి.

మిథునం:- అధికారుల వలన జరగవలసిన వ్యవహారాలు బాగుంటాయి. పుణ్య కార్యాలు చేస్తారు. నూతన వ్యవహారాలు లాభిస్తాయి. రావలసిన డబ్బు అందగలదు. వారం ఆఖరులో చేతిక్కిన అవకాశాలు కూడా జారిపోవచ్చును. స్త్రీలకు- ఆరోగ్యం బాగుండదు. వ్యతిరేకమైన వార్తలను వింటారు.

కర్కాటకం:- వ్యాపారంలో ఆదాయం బాగుంటుంది. మిత్రులకు సహాయం చేస్తారు. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులనుకల్సుకొంటారు. సాహసిక వ్యవహారాలు లాభిస్తాయి. స్త్రీలకు- దైవకార్యాలు నెరవేరతాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

సింహం:- సాహసిక వ్యవహారాల్లో నష్టం వస్తుంది. ఆందోళన కలుగుతుంది. వారం మధ్యలో వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. రావలసిన డబ్బు అందుతుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి స్త్రీలకు- ఆరోగ్యం బాగుండదు. బంధుమిత్రులను కల్సుకొంటారు.

కన్య:- రావలసిన డబ్బు అందుతుంది. ఉద్యోగంలో గౌరవం బాగుంటుంది వారం మధ్యలో చికాకులకు గురికాగలరు. వృత్తిలో యెవరినీ విశేషంగా నమ్మడం తగదు. వారం ఆఖరులో మీ కార్యక్రమాలు బాగుంటాయి. స్త్రీలకు- కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధువుల వల్ల ప్రయాసకు గురికాగలరు.

తుల:- వ్యాపారంలో పోటీవారి పోటీ పెరుగుతుంది. మీ కార్యక్రమాలకు మార్పులు వస్తాయి. ఆర్థిక వ్యవహారాలు బాగుంటాయి. వృత్తిలో ముఖ్యమైన వ్యక్తులను కల్సుకొంటారు. వారం ఆఖరులో శ్రమ కలుగుతుంది. స్త్రీలకు- ఆరోగ్యం బాగుంటుంది. ఆడంబరం కోసం వ్యయం చేస్తారు.

వృశ్చికం:- సాహసిక వ్యవహారాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. రాజకీయ వ్యవహారాల్లో శ్రమ కలుగుతుంది. పోటీవారితో వాద ప్రతివాదాలు తగవు మీ ఆలోచనలు ఫలిస్తాయి. స్త్రీలకు- కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు

ధనుస్సు: మీ కార్యక్రమాలు అడావుడిగా వుంటాయి. ఉద్యోగంలో గౌరవం లభిస్తుంది. వృత్తిలో ఆదాయం పెరుగుతుంది విద్యా వైజ్ఞానిక రంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. అనవసరమైన సందేహాలు కలుగుతాయి. స్త్రీలకు- ఆరోగ్యం బాగుంటుంది. బంధుమిత్రులను కల్సుకొంటారు.

మకరం:- సంతోషకరమైన వార్తలను వింటారు వృత్తిలో పోటీవారి పోటీ తగ్గుతుంది స్థిరాస్థి వ్యవహారాలు బాగుంటాయి. ఆర్థిక వ్యవహారాల్లో మొగమాటాలు తగవు. ముమ్ముందు లాభించగల వ్యవహారాల్లో అభివృద్ధిని సాధిస్తారు. స్త్రీలకు- పుణ్యకార్యాలు చేస్తారు. వినోద కాలక్షేపాల్లో పాల్గొంటారు.

కుంభం:- మీ శ్రమకు తగినఫలితం లభిస్తుంది. రావలసిన డబ్బు అందుతుంది. వ్యాపార విస్తరణ ప్రయత్నాలు బాగుంటాయి. మిత్రులకు సహాయం చేస్తారు. మీ మంచి తనమే మీకు యిబ్బందిని కలిగించగలదు. స్త్రీలకు- ఆరోగ్యం బాగుంటుంది. శుభకార్యాల విషయంలో అనుకూలత లభిస్తుంది.

మీనం:- వృత్తి వ్యాపారాలు బాగుంటాయి. ప్రయాణాలు ఫలిస్తాయి. సాహిత్య కళారంగాల్లో ఖ్యాతి లభిస్తుంది. ప్రయోజనంగల పరిచయాలు యేర్పడతాయి. రాజకీయ వ్యవహారాలు బాగుంటాయి. స్త్రీలకు- కుటుంబ వ్యవహారాలు బాగుంటాయి. బంధుమిత్రులను కల్సుకొంటారు.

—మహేష్

Printed and Published by S. NageswaraRao at the Andhra Patrika press, MallikarjunaRao Street, Gandhinagar, Vijayawada-3. Editor: S. Radhakrishna


ఆరు రంగులు
యీయన హృదయంలో అలరారుతున్నాయి. అయినా ఒక షర్టుకు రు. 40 లు మాత్రమే యీయన వ్యయం చేయదలుచుకున్నారు.

ఏ మిల్లు యీయనకు అవశ్యమైన షర్టింగును యివ్వగలదు?

లక్ష్మి. ఎందువల్లనంటే నారీమణులను వూహలో వుంచుకొనే లక్ష్మి సింథటిక్ బ్లెండ్‌తోకూడిన షర్టింగ్‌లను తయారుచేస్తోంది. నారీమణుల హృదయాలను చూరగొనాలనేగదా పురుషులు కనులకింపైన దుస్తులను ధరించుతున్నారు?

షర్టులకు సంబంధించినంతవరకు ప్రశాంతమైన చల్లని రంగుల చేరికగల షర్టులనే ఆఫీసుకు, డిజైన్లుగల షర్టులను సంధ్యాసమయాలలో బయట విహరించుటకు పురుషులు ధరించాలని కోరుకుంటారని లక్ష్మికి విదితం. అందువల్లనే ప్రత్యేకమైన షర్టింగు గుడ్డలను లక్ష్మి తయారు చేసి అందజేస్తోంది. అదే గోల్డ్ క్రౌన్.

గోల్డ్ క్రౌన్—పాలియెస్టర్ బ్లెండ్‌తోకూడిన రకరకాల షర్టింగు గుడ్డలు. ధరించువారలకు గాంభీర్యాన్ని చేకూర్చుతాయి. మీ మనస్సును రంజింపజేసే అనేక రంగులలో లభ్యంకాగలవు. మరోపర్యాయం షర్టింగు గుడ్డలను కొనే సందర్భంలో గోల్డ్ క్రౌన్ రకాలను తప్పకుండా అడిగిచూడండి. లేకపోతే లక్ష్మి షోరూముకు విచ్చేయండి. మీ అభిరుచికి అనువైన వివిధ రకాల బట్టలను లక్ష్మి అందజేస్తోంది.



లక్ష్మి

గోల్డ్ క్రౌన్® షర్టింగులు

ది
లక్ష్మి
మిల్స్
కంపెనీ లిమిటెడ్
కోయంబత్తూరు

FDS LM 2605 TEL



ముఖచిత్రం

"చిన్నారి పాపాయిల, చిరునవ్వుల చిలిపి చూపులే ప్రతీ యింటికి అందం" అన్నట్లుగా రుజువుచేసిన ఈ వారం 17-11-78 నాటి ఆంధ్రుల అందాల అభిమాన ఆనంద "ఆంధ్ర సచిత్ర వార పత్రిక" ముఖచిత్రం "చిన్నారి చిలిపి చూపులు" పత్రికకు క్రొత్త వన్నె చేకూర్చింది. ఇంత చక్కని ముఖచిత్రాన్ని అందజేసిన సంపాదకులకు మా హృదయ పూర్వక జోహార్లు.

ఈ సంచికలో కథలన్నీ చాల బాలబాగున్నాయి కథలన్నియూ ఒక దానితో నొకటి పోటీ పడుతున్నట్లుగా ఉన్నాయి.

"రాగద్వేషాలు" సీరియల్ రాగ రంజితమై మా హృదయాలలో చెరగరాని ముద్రవేస్తున్నది.

"కార్టూన్లు" కేకుల్లా ఉన్నాయి. రామలక్ష్మి "జవాబులు" వేడి వేడి మిరపకాయ బజ్జీల్లా ఉన్నాయి.

—న్యాయపతి రమేష్‌బాబు, గంటా ఉమాశంకర్ రెడ్డి, విజయ పియ, శ్రీలేఖ, సవిత, పుష్పలత, ప్రతిమ, లత, జయప్రద సంధ్యారాణి, హేమలత, సరోజ. [బరంపురం]

సినిమా

13-10-78 తేదీ సంచికలో 33వ పేజీలో ప్రచురించిన సన్నివేశం "కటకటాల రుద్రయ్య" సినిమాలో లేదు కదా? సెన్సార్ అయిందా మరి?

నిర్మల [వరంగల్] ●



ఆసక్తికరమైన 132 పేజీలు
అవును! 'చతుర'లోని ప్రతి ఒక్క పేజీ కూడా
ఆసక్తికరమైనదే! చివరివరకూ చదివింపజేసే
పూర్తినవల, నవలలోని రసవత్తర ఘట్టాలకు
అడుగడుగునా రెండు రంగుల చిత్రాలు,
ఆకర్షణీయమైన గెటప్‌కు తోడు అందమైన
ఆఫ్‌సెట్ ముద్రణ
నవలకాక అదనంగా 'చతుర మినీకతలు',
ఆశ్చర్య చకితులను చేసే 'చతుర ప్రపంచం'
మీరు ఊహించలేని అపురూప
ముఖచిత్రాలు!
చతుర
సమగ్ర నవలా వేదిక
125 పైసలు మాత్రమే
ప్రతినెలా 1వ తేదీకి వెలువడే నవ నవలా వేదిక 'చతుర'



VETAPALEM
SARASWATA NIKETANAM
ROOPASH
Multi Purpose
SANDAL WOOD
POWDER
Mfd. by. VIJAYA CHEMICAL
ROOPASH
AMLA
BRILLIANTINE
రాగరంజితం, మనోరంజిత
మైన మీ మనసుకి, నిత్య
నూతనత్వంకోరే మీ వయు
సుకి, అందమైన మీ చర్మ
రక్షణకు
రూపాష్
శాండిల్‌వుడ్ పౌడర్లనే
వాడండి
విజయ కెమికల్ & టాయిలెట్ వర్క్స్ (తెలంగాణా)
మద్రాసు-7వారి మరియొక అత్యుత్తమమైన తయారీ
నిండుగా ఒత్తుగా నల్ల
తల వెంట్రుకలకు ఆహ్లా
కరమైన చల్లదనమున
ఆకర్షణీయమైన సుగం
సౌరభమునకు రూపా
ఆమ్లా బ్రిలియంటైన్
వాడండి.